జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 5 పక్షపత్రిక మార్చి 1-15, 2016



## 'అందరికీ ఆరోగ్యం' అందించే లోక్‌సత్తా

## ప్రత్యామ్నాయ ఆరోగ్య విధానంపై త్వరలో రౌండ్‌టేబుల్ : జేపీ



## ఏది దేశభక్తి ?






## కులాల మధ్య చిచ్చు పెట్టే రాజకీయాలు ఎల్లకాలం సాగవు,
## నాణ్యమైన  విద్య - ఆరోగ్యమే వివక్షకు, పేదరికానికి నిజమైన పరిష్కారం

ప్రజలను కులం, మతం, ప్రాంతం, భాష పేరుతో  ఒకరిపై ఒకరిని ఉసిగొల్పి విభజించి ఓట్లు కొల్లగొట్టే జీరో-సమ్ గేమ్ రాజకీయాలు ఎల్లకాలం సాగవనటానికి రిజర్వేషన్లపై రాజస్థాన్‌లో గుజ్జర్లు, గుజరాత్‌లో పాటీదార్లు, ఆంధ్రప్రదేశ్‌లో కాపులు, హర్యానాలో జాట్లు చేస్తున్న ఆందోళనలే నిదర్శనం. పుట్టుకతో వివక్ష లేకుండా అందరికీ సమానావకాశాలు అందటానికి, పేదరికాన్ని నిర్మూలించటానికి అందరికీ నాణ్యమైన విద్య- ఆరోగ్యాన్ని అందించటం మినహా వేరే మంత్రం లేదు. సరైన విద్యను, ఆరోగ్యాన్ని అందించకుండా రాజకీయ పార్టీలు కులం పేరుతో విష రాజకీయాలు చేస్తూ  ప్రజలను విభజించి ఓటుబ్యాంకులుగా కొనసాగించే ప్రయత్నం చేస్తున్నాయి. రిజర్వేషన్ల లోపల అర్హులకు అవకాశాలు దక్కేలా, రిజర్వేషన్లకు బైట ఉన్నవారిలో పేదలకు కూడా న్యాయం జరిగేలా సంస్కరణలను చర్చించకుండా, దళితులకు - ఓబీసీలకు, బీసీలకు-ఓసీలకు, హిందువులకు-ముస్లింలకు, ఉత్తరాదివారికి - దక్షిణాదివారికి మధ్య చిచ్చుపెడుతూ లబ్ధి పొందుతున్నాయి. "ఎంతకాలం మన ప్రజల్ని ఇలా ముక్కలు చేస్తాం? అభివృద్ధి కావాలంటే సామరస్యత కావాలి.

- డా॥ జయప్రకాష్ నారాయణ్

గత శతాబ్దకాలంగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న

లోక్‌సత్తా పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు

# AESTAETICALLY DESIGNED HOMES

# *Balaji Infinity*

@ Amaravathi Road, Guntur

*Highlights*

- Located on the verge of Capital
- 10 Minutes drive from Busstand and Guntur New Railway Station
- 10 Minutes drive to NH-5
- 2 Minutes away from inner ring road & Cine Square Theatre
- Surrounded by Residential Flats
- 100% Vasthu Compliance
- Bank Loan facility

*Builders & Developers*

IDUPULAPADU Constructions Pvt. Ltd.

*Guntur, Andhra Pradesh, Mobile : 98482 78801, 720 777 0707 , 93468 70570*

*E-mail : idupulapaduconstructions@gmail.com*




*Our Previous Successful Ventures*


Balaji Residency @ Chilakaluripet



Balaji Residency (50 Flats) @ Addanki



Independent Villas @ Chennai



గత శతాబ్దకాలంగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న
లోక్‌సత్తా పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు

# జయ నర్సింగ్ హోమ్

కళామందిర్ వెనుక - చిలకలూరిపేట

Regd.14708 Hospital : 254322

## డా॥ ముద్దన రమేష్‌బాబు

M.D.D.G.O.



జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక మార్చి 1-15, 2016

సంపుటి - 7 సంచిక - 5

## లోపలి పేజీల్లో...

కేంద్ర ప్రభుత్వ పథకం ఆరోగ్య సంక్షోభాన్ని....... 7
ఇలాంటి పోలీసు, న్యాయవ్యవస్థలుంటే......... 8
ఏది దేశభక్తి......................................... 9
ఓడినా.... గెలిచిన.................................. 12
పిల్లల కథ - పెద్దల ఓటు.......................... 14
పొరుల చుట్టూ తిరిగే కొత్త రాజకీయంతో..... 15
అవినీతిని ఎన్టీఆర్ ద్వేషించేవారు................. 17
అవినీతిని ప్రజలపైకే నెట్టేసే పలాయనవాదం.... 19
అవినీతిపై 'న్యాయ' యుద్ధం....................... 21
గ్రూప్ ఫోటో కార్యక్రమంలా గవర్నర్ల సదస్సు.... 23
కేంద్రం తాబేదార్లుగా వ్యవహరిస్తున్న గవర్నర్లు... 24
రూ.లక్ష కోట్ల రెండు ప్రాజెక్టులు - అనేక ప్రశ్నలు..27
జస్టిస్ ఎం.ఎన్ రావ్ హితవు..................... 29
85శాతం మందికి కులపోళ్లు ఒరగ............. 31
సమానత్వానికి గడువు ఇంకా 14 ఏళ్లే.......... 33

సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి



## రిజర్వేషన్లను ఇలా సంస్కరిస్తే అందరికీ న్యాయం చేయగలం


1) ఎంపీ/ఎమ్మెల్యే/ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నతాధికారులు, డాక్టర్లు, సంపన్నవర్గాలకు రిజర్వేషన్లు ఎత్తివేయాలి. అప్పుడే అర్హులైన అణగారిన వర్గాలకు రిజర్వేషన్ ఫలాలు అందుతాయి.

2) పాఠశాల విద్యను సమూలంగా ప్రక్షాళన చేసి అందరికీ నాణ్యమైన చదువు అందేలా చేయాలి. ప్రతిభ ఉన్న ఏ ఒక్క విద్యార్థీ పేదరికం వల్ల ఉన్నత విద్యను అభ్యసించే అవకాశాన్ని కోల్పోకుండా ఖచ్చితమైన ఏర్పాట్లు చేయాలి.

3) ఓసీలలోని పేద విద్యార్థులు మిగతావాళ్లతో పోటీపడేందుకు వాళ్లకి 'అదనంగా' మార్కులు కలపాలి.

## సాధికారత

-చక్రవర్తి




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6–3–655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040–23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040–23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040–23311816**

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.


## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# కేంద్ర ప్రభుత్వ పథకం ఆరోగ్య సంక్షోభాన్ని పరిష్కరించలేదు,

## ప్రత్యామ్నాయ విధానాన్ని మోదీ సర్కారుకు పంపాం, త్వరలో రౌండ్‌టేబుల్: జేపీ



కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఆరోగ్య రక్షణ పథకం' అరకొరగా ఉందని, దేశ వైద్యారోగ్య రంగంలో నెలకొన్న పెనుసంక్షోభాన్ని ఏమాత్రం పరిష్కరించ లేదని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఆరోగ్యరంగంలో మనం బంగ్లాదేశ్, శ్రీలంక సహా చెప్పుకోదగిన దేశాలన్నిటికంటే అథమస్థానంలో ఉన్నామన్నారు. పేదరికంలో కూరుకు పోవటానికి అనారోగ్యమే ప్రధానకారణ మవుతోందన్నారు. కుటుంబ ఆరోగ్యాన్ని, ద్వితీయ, తృతీయ స్థాయి వైద్యసేవలని కవర్ చేస్తూ ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో అందరికీ ఆరోగ్యాన్ని అందించే విధానం భారత్‌కు అవసరమని, జీడీపీలో 2శాతం కేటాయింపుతో మొదలుపెట్టి ఐదేళ్లలో ఈ పథకాన్ని విస్తరించ వచ్చని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు జీడీపీలో 8శాతం ఆరోగ్యరంగం మీద ఖర్చు చేస్తున్నాయని, మనం కేవలం 1.2 శాతం ఖర్చు చేస్తున్నామని అన్నారు. సరైన ప్రణాళికతో 2శాతం వ్యయంతో మొదలైతే మనం ఆరోగ్య సంక్షోభం నుంచి బైటపడగలమన్నారు. ఆరోగ్యం వల్ల అభివృద్ధి, ఉద్యోగసామర్థ్యం పెరుగుతాయన్నారు. లోక్‌సత్తా మాతృసంస్థ 'ప్రజాస్వామ్య సంస్కరణల పీఠం' (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్-ఎఫ్‌డీఆర్) సమగ్ర జాతీయ ఆరోగ్య పథకం రోడ్‌మ్యాప్‌ని రూపొందించి భారత ప్రభుత్వానికి పంపిందని తెలిపారు. పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియాతో కలిసి త్వరలో ఈ విధానంపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని కూడా నిర్వహిస్తున్నామన్నారు. అభ్యున్నమైన చదువు, ఆరోగ్యాలతో మనదేశం గొప్ప దేశం కాలేదని, మనకు అతిపెద్ద సంపదగా ఉన్న మానవ వనరులను సద్వినియోగం చేసుకోవటానికి ఈ కీలక రంగాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా ప్రక్షాళన చేసుకోవాలని జేపీ అన్నారు. ◈

### ఆరోగ్యం.. అందని భాగ్యం

**దశాబ్దాలుగా ప్రజారోగ్యానికి బడ్జెట్ కేటాయింపులు తూతూమంత్రంగా ఉండటంతో సర్కారు దవాఖానాలు సదుపాయాల నుంచి వైద్యుల వరకూ అన్నింటిలోనూ తీవ్ర కొరత ఎదుర్కొంటున్నాయి.**

ఆరోగ్య రంగానికి మన జీడీపీలో కేటాయిస్తున్నది **1.04%**
దీన్ని కనీసం **2.5%**కి పెంచాలని ఐహెచ్‌ఆర్ నొక్కిచెప్పింది. ఈ విషయంలో రువాండా వంటి చిన్న దేశాల పరిస్థితి కూడా మనకంటే మెరుగ్గానే ఉంది.

| దేశం | ఆరోగ్యసేవలకు జీడీపీలో ఖర్చు |
|---|---|
| రువాండా | 10.5% |
| అమెరికా | 8.3% |
| అఫ్గానిస్తాన్ | 7.6% |
| భూటాన్ | 5.2% |
| చైనా | 3% |
| భారత్ | 1.04% |

ప్రభుత్వ ఆసుపత్రులంటేనే భయపడుతూ ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తుండటంతో సంపాదనలో ఆహారం తర్వాత అధిక భాగం వైద్యానికే ఖర్చైపోతోంది.

**భారత్‌లో మొత్తం వైద్యవ్యయంలో ప్రజలు భరిస్తున్నది 69.5% క్యూబాలో ఇది కేవలం 6.8%**

ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రతి 1000 మందికి ఒక వైద్యుడు ఉండాలి. మనం వెనకబడే ఉన్నాం. వివిధ దేశాల్లో ఇలా ఉన్నారు..

- ★ క్యూబా: 6.5
- ★ రష్యా: 4.3
- ★ అర్జెంటీనా: 3.8
- ★ అమెరికా: 2.4
- ★ భారత్: 0.7

(1278 మందికి ఒకరు)

ఏఎన్ఎంలు: 7.86 లక్షలు రిజిస్టర్డ్ నర్సులు, మిడ్‌వైఫ్‌లు: 17.80 లక్షలు ఫార్మసిస్టులు: 6.64 లక్షలు

**సర్కారు దవాఖానాల లెక్క ఇదీ..**

ఆరోగ్య ఉపకేంద్రాలు: 1,52,326
సామాజిక వైద్యశాలలు (సీహెచ్‌సీలు): 5,363
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు): 25,020

**ప్రధాన సమస్యలు:**

- ఇంటి దగ్గరి ప్రసవాలు. ఫలితంగా గర్భిణులు నవజాత శిశుమరణాలు
- పోషకాహార లోపం
- రక్తహీనత

* దేశంలో 55% మహిళలు, 69% పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు.

* 42% మంది చిన్నారులు పౌష్టికాహార లోపం తో కృశించిపోతున్నారు. ఈ సంఖ్య ప్రపంచంలోనే అత్యధికం.

* ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలు దేశంలో 1000కి 49.

మన దేశంలో నవజాత శిశు మరణాలు (ఏటా 7.3 లక్షలు) 1000కి 38

రెండు దశాబ్దాల్లో చైనా ఈ సంఖ్యను 42 నుంచి 9కి తగ్గించగలిగింది. బంగ్లాదేశ్, కాంగోలూ మనకంటే మెరుగే.

**2014 లెక్కల ప్రకారం నవజాత శిశు మరణాలు (1000కి)**

బ్రెజిల్: 14.4
రష్యా: 8.2
భారత్: 38
చైనా: 9
దక్షిణాఫ్రికా: 34.4

# ఇలాంటి పోలీసు, న్యాయవ్యవస్థలుంటే ప్రభుత్వానికి వేరే శత్రువులు అక్కర్లేదు: జేపీ



ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ ఘర్షణల కేసులో న్యాయస్థానం ఆవరణలో జరిగిన దాడికి పాల్పడినవారిని పోలీసులు అరెస్టు చేయకపోవటం, లాయర్లు ఇతరుల మీద దాడులకు పాల్పడటం, సుప్రీంకోర్టు ఇచ్చిన బదిలీ ఆదేశాలపై మద్రాసు హైకోర్టు జడ్జీ స్టే ఇవ్వటం, జడ్జీలను జడ్జీలే నియమించుకోవటం చూస్తుంటే మనం అరాచకత్వంలోకి దిగజారిపోతున్నట్టుందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఒక దాడి ఘటనపై సుప్రీంకోర్టు విచారణ కోసం పోలీసులు వేచిచూడటం సిగ్గుచేటన్నారు. ఇలాంటి పోలీసు, న్యాయవ్యవస్థలుంటే ఇక ప్రభుత్వానికి వేరే శత్రువులు అక్కర్లేదన్నారు. అధికారంలో ఉన్న పార్టీలు వెన్నెముక లేని వాళ్లని, సొంత మనుషుల్ని కీలకస్థానాల్లో కూర్చోబెట్టటం వల్ల ఇలాంటి దుస్థితి ఏర్పడుతోందన్నారు. దీనివల్ల దేశం నష్టపోతోందని, వ్యవస్థలు నాశనమవుతున్నాయని, ప్రజల్లో వ్యవస్థల పట్ల విశ్వసనీయత దిగజారుతోందని అన్నారు. చట్టబద్ధపాలన లేకుండా పోయిందని స్పష్టంగా కనిపిస్తోందని, బడితె ఉన్నవాడిదే బర్రె అంటే ఇక అరాచకమేనని, సమగ్ర సంస్కరణ తక్షణావసరమన్నారు.

*(పార్లమెంటుపై దాడి కేసులో మరణశిక్షకు గురైన అఫ్జల్ గురుకి మద్దతుగా ఫిబ్రవరి 9న జేఎన్‌యూలో సమావేశం నిర్వహించి భారత వ్యతిరేక నినాదాలు చేసినందుకు రాజ/దేశద్రోహ నేరం కింద కన్నయ్య కుమార్ అనే విద్యార్థి నేతను అరెస్టు చేశారు. మరికొందరి మీద కేసులు నమోదు చేశారు. ఈ నినాదాలకు రుజువుగా చూపుతున్న వీడియోలో ఉన్నవారంతా విద్యార్థులేనా అనే సందేహాలు కూడా ఉన్నాయి. కన్నయ్య కుమార్‌ని హాజరుపరిచిన ఢిల్లీలోని పాటియాలా న్యాయస్థానాల సముదాయంలో జేఎన్‌యూకు చెందిన విద్యార్థులు, బోధన సిబ్బంది, ఇతరులను జాతి వ్యతిరేక శక్తులంటూ కొంతమంది న్యాయవాదులు చితకబాదారు. మీడియావారికీ గాయాలయ్యాయి. ఢిల్లీ బీజేపీ శాసనసభ్యుడు ఓపీ శర్మ కూడా న్యాయవాదులతో కలిసి దాడికి పాల్పడ్డారు. ఇంత జరుగుతున్నా ఢిల్లీ పోలీసులు కనీస చట్టబద్ధ చర్యలు తీసుకోకుండా మౌనప్రేక్షకుల్లా వ్యవహరించారు. విచారణ సమయంలో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినా పట్టించుకోకుండా రెండోసారి కూడా పాటియాలా హౌస్‌లో న్యాయవాదులు దాడులకు పాల్పడుతుంటే పోలీసులు పట్టించుకోలేదు. న్యాయవాదులు ఆ వృత్తిని చేపట్టేముందు చేసిన ప్రతిజ్ఞకు విరుద్ధంగా అనేకమార్లు సమాజంలో బాధ్యతాయుత వ్యక్తుల మీద దాడిచేసినప్పుడు, ఢిల్లీలోనే ఘటనలు జరిగినప్పుడు పట్టించుకోని జాతీయ మీడియా ఈసారి తమ మీద కూడా దాడులు జరగటంతో న్యాయవాదుల మీద విరుచుకుపడుతోంది. విశ్వవిద్యాలయాల్లో గత కొంతకాలంగా పట్టుకోసం ప్రయత్నిస్తున్న బీజేపీ, వామపక్షాలు, కాంగ్రెస్ ఈ అంశాన్ని రాజకీయ సవాలుగా మార్చి ప్రజల్లో, ముఖ్యంగా యువతలో స్పష్టమైన చీలిక తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. స్వతంత్ర పోరాటంలో బ్రిటీషువారికి అనుకూలంగా వ్యవహరించటం, మహాత్మాగాంధీని చంపిన గాడ్సేకి మద్దతివ్వటంపై వామపక్షాలు, ఆర్‌ఎస్‌ఎస్ పరస్పరం విమర్శించుకుంటున్నాయి. కాశ్మీర్‌లో వేర్పాటువాదాన్ని పెంచిన కాంగ్రెస్ ఇప్పుడు విశ్వవిద్యాలయాల్లో కూడా దేశద్రోహులకు మద్దతిస్తోందని బీజేపీ విమర్శిస్తుండగా, తమ రక్తంలోనే దేశభక్తి ఉందని, కాశ్మీర్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు వేర్పాటువాద మద్దతుదారులతో చేతులు కలిపిన బీజేపీ.. వర్సిటీలలో నినాదాలు చేశారంటూ విద్యార్థుల మీద దేశద్రోహ నేరాలకు పాల్పడుతోందని కాంగ్రెస్ ప్రత్యారోపణలు చేస్తోంది. మద్రాసు ఐఐటీలో ఘటనలకు, హైదరాబాద్ హెచ్‌సీయూలో రోహిత్ వేముల ఆత్మహత్య కూడా ప్రభుత్వ హిందూత్వ ఫాసిజం వల్లే జరిగిందని ధ్వజమెత్తింది)*

నినాదాలు దేశద్రోహమనుకోనక్కర్లేదని, కానీ దేశ ఐక్యత విషయంలో రాజీలేకుండా వ్యవహరించాలని జేఎన్‌యూ క్యాంపస్‌లో ఘటనల నేపథ్యంలో జేపీ వ్యాఖ్యానించారు. భారతదేశానికున్న పరిస్థితుల్లో శాంతిసామరస్యాలు, అభివృద్ధి కోసమే దేశ ఐక్యతను కోరుకుంటున్నాం తప్ప దేశమంటే దైవం, దేశాన్ని పూజించాలి కాబట్టి.. కాదన్నారు. వాస్తవాలు, హేతుబద్ధత స్థానంలో అరుపులు, దుర్భాషలు, దాడులు జరుగుతుంటే స్వేచ్ఛ, నాగరికత మనుగడ సాగించలేవని, మనం మేలుకోవాలని అన్నారు. పటిష్ట స్థానిక ప్రభుత్వాలతో రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి, సొంత రాజ్యాంగాలు ఇచ్చి కేంద్రప్రభుత్వం జాతీయస్థాయి అంశాలకు పరిమితమవటం వల్ల ఫెడరలిజం బలోపేతమై అందరి ఆకాంక్షలూ నెరవేరతాయని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ◈

# ఏది దేశభక్తి?



దేశభక్తి, దేశద్రోహంపై దేశవ్యాప్తంగా కత్తులు దూసుకుంటూ దేశ ప్రజలను తమ సైన్యాలుగా, ఓటుబ్యాంకులుగా తయారుచేసుకునే ప్రయత్నం దేశవ్యాప్తంగా జరుగుతోందిప్పుడు. భారత పార్లమెంటు మీద దాడికి పాల్పడిన యాకుబ్ మెమన్‌ని ఉరితీయటం న్యాయవ్యవస్థ వైఫల్యమని భావిస్తున్నవారిని దేశద్రోహులుగా చిత్రీకరించేందుకు పాలకపక్షం బీజేపీ శక్తులు శతవిధాలా ప్రయత్నిస్తుంటే, కాంగ్రెస్ సహా చాలా ప్రతిపక్షాలు ప్రభుత్వం దేశభక్తి ముసుగులో హిందూత్వ రాజ్యాన్ని తయారుచేయటానికి ప్రయత్నిస్తోందని ఎదురుదాడి చేస్తున్నాయి. దళితులను, ముస్లింలను ఒక గొడుగు కిందకు తెచ్చి హిందూ భావనను మైనారిటీగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రీయ వర్సిటీలో రోహిత్ ఆత్మహత్య, ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘం సమావేశం, నినాదాలు, విద్యార్థి నేత అరెస్టు దేశాన్ని అట్టుడికిస్తున్నాయి. రోహిత్ ఆత్మహత్య, జేఎన్‌యూ వివాదాలకు కారకాలు ఎప్పటినుంచో రగులుతున్నప్పటికీ అవి ఈ రెండు శక్తుల మధ్య స్వార్థ రాజకీయ పోరాటం తక్షణ ఇంధనంగా మారటంతో ఇప్పుడు జాతీయస్థాయి అంశాలుగా మారాయి.

నినాదాలు చేస్తేనే దేశద్రోహమవుతుందా అని జేఎన్‌యూ వివాదంలో తొలుత ప్రశ్నించిన ప్రతిపక్షాలు, వివిధ సంఘాలు ఇప్పుడు విద్యార్థులు దేశద్రోహ నినాదాలు చేశారని చెబుతున్న వీడియో నకిలీదని, ప్రభుత్వ అండతో సంఘపరివార్ శక్తులే అలా చేశాయని ఆరోపిస్తుండగా, విద్యార్థుల్లో దేశద్రోహ శక్తులు లేకుంటే యాకుబ్ మెమన్‌ను ఉరితీసిన రోజు (ఫిబ్రవరి 9) అలాంటి సమావేశం ఎందుకు నిర్వహించాలని పాలక పక్షంవారు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థి నేత కన్నయ్య కుమార్ అరెస్టును, కోర్టు ఆవరణలో న్యాయవాదులు దాడిచేయటాన్ని, విదేశీ వర్సిటీలు, పలువురు విదేశీ వామపక్ష భావజాలురూ ఖండించారు. ఇప్పుడు ఇంతకీ ఎవరు దేశభక్తులు? ఎవరు దేశద్రోహులు?

నిజానికి గత ఏడాదిగా వివిధ ఉన్నత విద్యాసంస్థల్లో, విశ్వవిద్యాలయాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాల్ని, పాలకులు సహా వివిధ పార్టీలు అనుసరిస్తున్న తీరును చూస్తే దేశభక్తిపై నినాదాల విషయంలో వీరంగాలు తప్ప విధానాలపై చర్చ, ఆచరణలో నిబద్ధత కనిపించదు. దేశభక్తి అంటే భారతమాతను దైవంలా పూజించటం, జెండా ఎగరవేయటమే ముఖ్యమని బీజేపీ పరివారం భావిస్తుండగా, స్వేచ్ఛ ముసుగులో రిజర్వేషన్లు వంటి వాటితో కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టి సమీకరణలు చేయటం కాంగ్రెస్, ఇతర పక్షాలకార్యక్రమంగా వస్తోంది. ఎవరి ఓటు బ్యాంకులను వారు తయారుచేసుకుని కాపాడుకోవటమే ఇప్పుడు జరుగుతున్నదంతా.

నిజానికి ఈ విభజన ధోరణులకు అతీతంగా అందరికీ ఎదిగే అవకాశాలను కల్పిస్తానన్న హామీ ఇవ్వబట్టే నరేంద్ర మోదీని ప్రజలు ప్రధానిగా ఎన్నుకున్నారు. కానీ ఆయన ఆ దిశగా మౌన, మందగమనంతో సాగుతూ దేశభక్తి పేరుతో ప్రజలను చీల్చే రాజకీయాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఊతమిస్తున్నారు. మోదీ తాను ఎన్నికల్లో చెప్పింది చేయకుండా యథాస్థితిని కొనసాగిస్తుండటంతో, హిందూత్వ శక్తులుగా ఉన్నవారు చేస్తున్న ఘర్షణాత్మక విషయాలే ప్రాచుర్యంలోకి వస్తున్నాయి. మోదీ పాలన నిజమైన మార్పు దిశగా ఉంటే, మోదీ గనక సరైన ఆలోచాపరుల బృందాన్ని ఏర్పరుచుకుని దేశంలో ఆటగాళ్లను కాకుండా ఆటనియమాలను మార్చే ప్రయత్నం మొదలుపెట్టి ఉంటే ప్రతిపక్షాలు ఎంత ప్రయత్నించినా హిందూత్వ రంగు ఘర్షణలకు ఇంత ప్రాధాన్యత లభించేదికాదు. సమస్యలు వచ్చినప్పుడు వాజ్‌పేయిని తలుచుకుని ఆయన పదవిలో ఉండిఉంటే ఏం చేస్తారో ఊహించి పనిచేయాలని సూచనలు అందుకోవాల్సిన స్థితిలోకి



మోదీ వచ్చారు. భారత్‌లో 21వ శతాబ్దపు జీవనానికి ప్రాతినిధ్యం వహించగల శక్తి శతాబ్దాలపాటు అమానుషమైన కులాల దొంతరగా ఉన్న జీవనవిధానాన్ని లక్ష్యంగా చూపిస్తున్న హిందూత్వ శక్తుల ఎజెండాకి లేదు. ఏ విధమైన ఆధునికతను చెప్పాలన్నా ఆ భావజాలానికి కులం అడ్డువస్తుంది. దాన్ని అధిగమించి నిజమైన హిందూమత, భారతీయ బహుళత్వ విలువలకి భావజాలాన్ని విస్తరించటానికి, ఈవేళ దేశానికి కావలసిన మంచి రాజకీయం, మంచి పరిపాలన వంటి లక్ష్యాలతో అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసే కొత్త రాజకీయానికి ఆ శక్తులు ఇంకా సిద్ధంగా లేవు. పాత రాజకీయ పార్టీల ఒరవడిలోనే ఓటుబ్యాంకు రాజకీయాల కోసం విభజనను సృష్టిస్తున్నాయి. విశ్వవిద్యాలయాల్లో కులవివక్షే లేదన్నట్టు సాక్షాత్తూ కేంద్ర మానవవనరుల మంత్రి పార్లమెంటులో నాటకీయంగా మాట్లాడిన తీరు హిందువులలో మెజారిటీగా ఉన్న బహుళత్వవాదులకి తీవ్ర అసంతృప్తి కలిగించింది.

మెజారిటీ, మూలవాసుల వాదనతో తమ వాదానికి దేశభక్తి పేరు పెట్టుకుని ఈ హిందూత్వ శక్తులు ఎలాగైతే ప్రజలను విభజిస్తున్నాయో, అదేరీతిలో పైకి అభ్యుదయం, సెక్యులర్ ముసుగు వేసుకుని ఆచరణలో ాల వివక్షను, పేదరికాన్ని నిరంతరం కొనసాగించే విధానాలున్న పార్టీలు కూడా భావప్రకటనా స్వేచ్ఛ పేరుతో ప్రజల మధ్య చిచ్చుకపెడుతూ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నాయి.


నిజమైన దేశభక్తి ఉన్న పార్టీలు, సంఘాలు, వ్యక్తులు దేని కోసం పోరాడాలి?

నిజమైన దేశభక్తి ఉన్నవారు ముందు ఈదేశంలో చట్టబద్ధ పాలనను కోరుకోవాలి. చట్టం, న్యాయం ముందు అందరూ సమానమే అని ఖచ్చితంగా అమలుచేసి అందరికీ భద్రత కల్పించాలి. పుట్టుకతో వివక్ష లేకుండా ప్రతి బిడ్డా ఎదిగేందుకు అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించాలి. అధికారాన్ని వికేంద్రీకరించి జనం చేతికి ఇవ్వాలి. ప్రజల్ని నిరంతరం యాచించేవారుగా కాకుండా వారికి తలెత్తుకుని బతికే జీవితాన్ని అందించే ఏర్పాట్లు చేయాలి.కకులం, మతం, ప్రాంతం, భాష పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు దండుకునే జీరో-సమ్ రాజకీయాలు చేయకుండా అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేయాలి. ఇప్పుడు దేశభక్తి గురించి అరిచిగీపెడుతున్న పార్టీలు, శక్తులు వీటి గురించి మాట్లాడు తున్నాయా? అధికారంలో ఉన్నప్పుడు వీటిని అమలు చేస్తున్నాయా? ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వీటి కోసం పోరాడుతున్నాయా?

వాస్తవానికి జేఎన్‌యూలో జరిగిన గొడవ పూర్తిగా చట్టబద్ధపాలనకు సంబంధించినది. దాడులకు పాల్పడకుండా నిరోధించలేని, దాడులు జరిగాక చర్యలు తీసుకోలేని స్థాయి వ్యవస్థల్ని తయారుచేయటంలో కీలకపాత్ర పోషించిన వీరంతా దేశభక్తి గురించి ఏం మాట్లాడతారు? దేశంలో రాజ్యాంగ, చట్టబద్ధపాలనను దిగజార్చటంతోపాటు దళితులు ఎదిగేందుకు మంచి విద్య, ఆరోగ్యాన్ని అందించకుండా దశాబ్దాలపాటు దగా చేసిన కాంగ్రెస్, సోషలిస్టు భావజాలురు సహా ఇతరపార్టీలు ఏ మొహం పెట్టుకుని ఇప్పుడు తాము ఈ దేశానికి ద్రోహం చేయలేదని దబాయిస్తాయి?

# 'సినీ' బ్రాండ్ ఇండియా

మనదేశానికి బ్రాండ్ అంబాసిడర్లుగా నియమిస్తున్న సినిమా యాక్టర్లను చూస్తే పాలకులు దేశభక్తి గురించి ఏమనుకుంటున్నామో, వారికి నిజమైన ఎంత దేశభక్తి ఉందో తేటతెల్లమవుతుంది.



భారత్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా సినిమా హీరోలను నియమించుకోవటం ఇటీవల పెరిగిపోతోంది. అంటే ప్రపంచం వీళ్లను చూసి భారత్‌ను అంచనా వేయాలన్నమాట. భారత్‌లో ఏముంది, ఏమి జరుగుతోంది, పరస్పర ప్రయోజనానికి భారత్‌తో కలిసి ఎలా పనిచేయొచ్చు వగైరా అంశాలన్నిటి మీద దేశవిదేశాల్లోనివారు, ముఖ్యంగా యువత తక్షణ ఐడియాకి రావటానికి ఈ సినిమా హీరోలు, అడపాదడపా హీరోయిన్లు, క్రీడాకారులు ఉపయోగపడటం ఈ రాయబార నియామకాల వెనక లక్ష్యం. దాంతోపాటు స్వదేశంలోని యువతకు కూడా వీళ్లు స్ఫూర్తిదాతలుగా ఉండాలి.

ఇన్‌క్రెడిబుల్ ఇండియాకు తొలుత అమీర్‌ఖాన్, ఆ స్థానంలో ఇప్పుడు అమితాబ్ బచ్చన్, ప్రియాంక చోప్రా బ్రాండ్ అంబాసిడర్లు. అయితే, నిజంగా ఇండియాకి బ్రాండింగ్ చేసే సామర్థ్యం, నేపథ్యం వీరికుందా? భారతదేశం అంటే ఏమిటి, భారతదేశానికి ఇప్పుడు ఏం కావాలి అనే అంశాల మీద నిజమైన దేశభక్తులకుండే స్పష్టత వీరికుందా? భారతదేశ యువతకు బంగారు భవిష్యత్తునేసే ఈ అంశాలపై వీరికున్న అవగాహన ఎంత? ఒకవేళ ఉన్నా అందుకోసం పనిచేసే చిత్తశుద్ధి, పనిచేసిన చరిత్రా ఉన్నాయా?

**పాలకులు బ్రాండ్ అంబాసిడర్లుగా పెట్టినా, రాజకీయాలలోకి వచ్చినా సినిమా యాక్టర్లను మనం ఆదరిస్తున్నాం. సినిమాలకి మించిన హీరోయిజం మన హీరోలలో ఉందనుకోబట్టే.. నటులను రాజకీయ నేతలుగా, బ్రాండ్ అంబాసిడర్లుగా ఆమోదిస్తున్నాం. సినిమాలో హీరోయిజం సినిమాకే పరిమితం అనుకుంటే మనం వారిని అంత ఆదరించం. కానీ మనం ఆశిస్తున్న నిజమైన హీరోయిజం మన సినీ హీరోల్లో ఉందా?**

పాలకులు బ్రాండ్ అంబాసిడర్లుగా పెట్టినా, రాజకీయాలలోకి వచ్చినా సినిమా యాక్టర్లను మనం ఆదరిస్తున్నాం. సినిమాలకి మించిన హీరోయిజం మన హీరోలలో ఉందనుకోబట్టే.. నటులను రాజకీయ నేతలుగా, బ్రాండ్ అంబాసిడర్లుగా ఆమోదిస్తున్నాం. సినిమాలో హీరోయిజం సినిమాకే పరిమితం అనుకుంటే మనం వారిని అంత ఆదరించం. కానీ మనం ఆశిస్తున్న నిజమైన హీరోయిజం మన సినీ హీరోల్లో ఉందా? జనం జీవితాల్ని మెరుగుపరచటానికి తగిన ఎజెండాను గుర్తించి, దాన్ని ఆచరణలోకి తేవటానికి తనకున్న వనరుల్ని పెట్టుబడిగా పెట్టేవారు నిజమైన దేశభక్తులు, హీరోలు. అలాంటివారు మాత్రమే బ్రాండ్ ఇండియాకు ప్రాతినిధ్యం వహించటానికి అర్హులు. అలాంటి హీరోయిజం మన సినిమా హీరోలలో చాలా పరిమితంగా ఉందని మనకు వారి జీవితాల్ని పైపైన స్పృశించినా అర్థమవుతోంది. వాళ్లలో చాలామంది వ్యక్తిగతంగా ట్రస్టులు, సేవాకార్యక్రమాలతో కొందరికి ఏదోకరకమైన సహాయాన్ని అందిస్తుండవచ్చు. ఆ మేరకైనా వారి సేవలను స్వాగతించాల్సిందేకానీ, వారి స్థాయికి, ఈ దేశం అవసరాలకు అది చాలా తక్కువ. అందుకే వారిని సినిమాల్లో హీరోల పాత్రలు వేసుకుని డబ్బు తీసుకునే వృత్తినిపుణులుగానే చూడాలి. వారు దేశం కోసం నిలబడి ప్రజలను బాగు చేసే ఎజెండా కోసం పనిచేసినప్పుడు మాత్రమే నిజమైన హీరోలుగా భావించాలి.

దేశభక్తిపై నినాదాలకు, మొక్కుబడి కార్యక్రమాలకు, సినీగ్లామర్‌కు పరిమితంకాకుండా అసలైన విధానాలు, ఆచరణ గీటురాళ్లుగా మనం స్పందించాలి. అప్పుడే రోహిత్ విషాదాలు, భావప్రకటనా స్వేచ్ఛపై దాడులు వంటివి పునరావృతం కాకుండా ఆపగలం. పుట్టుకతో వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే, నివారించదగ్గ బాధలని తొలగించే గొప్ప భారతదేశాన్ని నిర్మించుకోగలం. ◈



# ఓడినా... గెలిచిన

మీరంతా ఊహించినట్టే సాంప్రదాయ రాజకీయ (సా.రా) పార్టీలకు ఎదురొడ్డి నిలవలేకపోయా. 907 ఓట్లు మాత్రమే తెచ్చుకోగలిగా. నాలుగవ స్థానంలో నిలిచా. 42శాతానికి మించి ప్రజలని పోలింగ్ బూత్‌లకు రప్పించ లేకపోయా. చదువుకున్న విద్యార్థులను మందుబాటిళ్ల నుంచి దూరం చెయ్యలేక పోయా. హాస్టళ్లలో ఓటుకి 1000–1500 రూపాయలు తీసు కోకుండా ప్రజలను చైతన్య పరచలేకపోయా. మహిళా సంఘాల ఓట్లను కొనకుండా ఆపలేకపోయా. సొంత ఇళ్లు ఉన్నవాళ్లను కూడా పార్టీలు పంచిన మందుబాటిళ్లు స్వీకరించుకుండా ఆపలేకపోయా. నా ఉపన్యాసాలు విన్నవారిని కూడా నేనే ఉత్తమమైన అభ్యర్థినని నమ్మించలేకపోయా. మరి ఈ పోరాటం ఎందుకోసం అంటారా?

1) ఒక మాజీ కార్పొరేటర్ “2 నిముషాలు ఆ అబ్బాయి మాటలు వింటే, నాకే అతనికి ఓటు వెయ్యాలనిపించింది. ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటి?” అన్నప్పుడు– అన్ని పార్టీలలో మంచివారు ఉన్నరు, ప్రజల్లో ఇంకా మంచితనం ఉంది, దాన్ని బయటికి తియ్యడానికి పోరాడాలనిపించింది.

2) ఇంటి దగ్గర ఒక ఆంటీ మాట్లాడుతూ, “మా ఆయన ఫలానా పార్టీకి పని చేస్తున్నాడు, నిన్న మా ఆయనతో గొడవ పడ్డ. నీకు పోలింగ్ ఏజెంట్లా పనిచేస్తానంటే, మా ఆయన “ఇదొక్కసారి నా మాట విను. ఇంట్లో భార్యని ఒప్పించలేకపోతే నువ్వు జనాలని ఎలా ఒప్పిస్తవ్” అని మా నాయకులు ప్రశ్నిస్తరు అన్నాడు. నేను ఓటు మాత్రం నా ఇష్టం ఉన్నవాళ్లకు వేస్తానని చెప్పిన. నా ఓటు నీకే. లేకపోతే ఈ మందుబాటిళ్లు పంచడం ఏంటి. ఇంకా ఎన్ని రోజులని జనాలని మోసం చేస్తారు” అని అన్నప్పుడు మంచి భావజాలానికి సాంప్రదాయ రాజకీయ పార్టీల కుటుంబాల నుంచి కూడా మద్దతు వస్తుందని నమ్మకం వచ్చింది. వీళ్లు కోరుకుంటున్న మార్పు తీసుకురావడానికి పోరాడాలనిపించింది.

3) ఓటింగ్ రోజు ఒక యువ జంట పోలింగ్ బూత్ ముందు నిలబడి “మీకు ఓటు వేద్దామని కూకట్‌పల్లి నుంచి వచ్చాం (30 కిలోమీటర్లు). మీ స్పీచ్ ఫేస్‌బుక్‌లో చూశాం” అన్నప్పుడు ఫేస్‌బుక్కుల్లో ఉన్నవారు కేవలం మాటలకే పరిమితం కాదని సంతోషం వేసింది. చదువుకున్నవారి ద్వారా మార్పు తీసుకురావచ్చని, దాని కోసం పోరాడాలనిపించింది.

4) ఓటింగ్ రోజు సాయంకాలం రోడ్డు మీద నడస్తుంటే ఇద్దరు యువకులు బైక్ మీద వచ్చి, వారిలో ఒకరు “అన్నా, ఏమనుకోకండి అన్నా. మా మనసులు చంపుకోలేక ఒక ఓటు మీకు, ఒక ఓటు తెలుగుదేశంకి వేశాం అన్నా” అన్నప్పుడు కొద్దిగా కష్టపడితే, ప్రజలను సా.రా పార్టీల నుంచి దూరం చెయ్యొచ్చు అనిపించింది. అలా చెయ్యడానికి పోరాడాలనిపించింది.

5) ఎక్కడో హుజూరాబాద్‌లో ఫేస్‌బుక్‌లో నా స్పీచ్ విని, వెంటనే మూట సర్దుకుని హైదరాబాద్ బస్సెక్కిన పూర్ణచందర్‌ని చూసి, పోరాటంలో నేను ఒంటరిని కాదన్న రెట్టించిన ఉత్సాహంతో పోరాడాలనిపించింది.

6) చిన్న పిల్లలకు కూడా నేనే గెలవాలనిపించేటట్టు మన భావజాలం ఉందని అర్థమైనప్పుడు, ఏదో ఒక రోజు మార్పు తప్పనిసరిగా వస్తుందని అర్థమయ్యి పోరాడాలనిపించింది.

7) ఓటింగ్ రోజు నేను పోలింగ్ బూత్‌లు సందర్శిస్తుంటే,




ప్రతి పార్టీ నాయకుడు నన్ను ఆపి మరీ "నీలాంటి వారు రాజకీయాల్లోకి రావాలి. అందరిలో ఉత్తమ అభ్యర్థి నువ్వే. నిన్ను సపోర్టు చెయ్యలేకపోతున్నందుకు బాధపడుతున్నాం. ఆల్ ది బెస్ట్. నీకు గొప్ప ఫ్యూచర్ ఉంది" అన్నప్పుడు, మార్పు అతిత్వరలో సాకారం కాబోతోందన్న విషయం అర్థమై పోరాడాలనిపించింది.

8) ఎన్నికల తర్వాత ఒక రెస్టరెంట్‌కి వెళితే అక్కడ వెయిటర్ "మిమ్మల్ని పీ అండ్ టీ కాలనీలో చూసిన. ఇంకా మీలాంటి వాళ్లు ఉన్నారంటే నమ్మలేకుంటున్న. మీరు మీ పోరాటాన్ని ఆపొద్దు. పైకి చెప్పలేకపోయినా ఎంతో మంది లోలోపల మీ విజయాన్ని కోరుకుంటున్నారు. మీ హ్యాట్సాఫ్. ఇవ్వాళ మధ్యాహ్నం మంత్రి ................ వచ్చారు. కానీ మేం పట్టించుకోలే. మిమ్మల్ని మాత్రం పట్టించుకోకుండా ఉండలేం. మీరు చేస్తున్న వర్క్ అలాంటిది. మా సపోర్టు ఎప్పటికైనా మంచి వైపే. ఆల్ ది బెస్ట్" అన్నప్పుడు, కనీసం ఇలాంటి వారి కోసమైనా పోరాడాలనిపించింది.

9) నన్నెప్పుడూ చూడని ఎంతోమంది ఆన్‌లైన్‌లో నన్ను గెలిపించమని పోస్టులు పెడుతుంటే, నన్ను చూడనివారు నాకు చందాలు ఇస్తుంటే, "మంచికి కాలం చెల్లదు. మంచి రాజకీయాన్ని గెలిపించుకోవడం ఆచరణసాధ్యమే" అని తెలిసి పోరాడాలనిపించింది.

10) నా ప్రచారానికి నాకంటే ఎక్కువ కష్టపడ్డ మా కార్యకర్తల, స్నేహితుల తపన చూసి, నేను ఓడిపోయినప్పుడు ఏడ్చినవారిని చూసి, నేను ఓడిపోయానని తెలిసి నిద్రలేని రాత్రి గడిపిన కొంతమందిని చూసి– వీళ్ల విశ్వాసాన్ని గెలిపించడానికైనా పోరాడాలనిపించింది.

అందుకే ఎన్నికల్లో ఓడినా... ప్రజల మనసులు గెలిచానని అనిపించింది.

నన్ను ప్రోత్సహించిన వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

మీ

దొంతినేని నరసింహ

ఫిబ్రవరి 2, 2016న జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గడ్డిఅన్నారం డివిజన్ లోక్‌సత్తా పార్టీ అభ్యర్థి

◈

# పిల్లల కథ - పెద్దల ఓటు



మన పిల్లలకు నేర్పించే చదువులో కథలు ముఖ్యభాగం. పిల్లల జీవితాలు సుఖంగా, సంతోషంగా ఉండేందుకు కావలసిన తెలివితేటలు, సృజనాత్మకత, విలువలు ఆ కథల నుంచి వస్తాయని మన ఆలోచన. అందుకే అడక్కుండానే కథల పుస్తకాలను, సీడీలను కొనిస్తాం. తెలుగునాట బాగా ప్రాచుర్యం పొందిన పిల్లల కథకుల్లో చొక్కాపు వెంకటరమణ ఒకరు. నిజానికి ఆయన పిల్లల కోసం చేసే బహుముఖ కృషిలో కథలు రాయటం ఒక భాగం మాత్రమే. తరచూ పిల్లల కార్యక్రమాలను నిర్వహించే వెంకటరమణ పలువురు హైదరాబాద్‌వాసులకు ప్రత్యక్షంగా కూడా పరిచయస్తులే. "నిజమైన కానుక" అనే పేరుతో ఆయన రాసిన ఓ కథ ఇటీవల ఒక ప్రముఖ దినపత్రిక పిల్లల పేజీలో ప్రచురితమైంది. ఇదీ కథ:




"కలికిపురం గ్రామంలో ప్రజలంతా చాలా పేదవాళ్లు. తినటానికి తిండి, తాగటానికి నీరు లేక అలమటించి పోయేవారు. వారి దుస్థితిని ఎవరూ పట్టించుకోలేదు.

ఒకసారి ముగ్గురు వ్యాపారులు ఆ గ్రామం మీదుగా వెళుతూ అక్కడి ప్రజల ఇబ్బందులను కళ్లారా చూశారు. 'పాపం' అని జాలిపడ్డారు. వారి కోసం ఏమైనా చేయాలని నిర్ణయించుకున్నారు.

మరునాడు వారిలో ఒకడైన బంగారు వ్యాపారి ఆ గ్రామానికి తిరిగి వచ్చాడు. తను తెచ్చిన బంగారు, వెండి ఆభరణాలను అందరికీ పంచి పెట్టాడు. ఆ గ్రామ ప్రజల్ని కరవు నుంచి కాపాడటానికి తను చేసిన పనిని పదిమందికీ చెప్పి పక్కనున్న పట్నంలో ఘనసత్కారాలు అందుకున్నాడు.

ఇంకోరోజు రెండో వ్యాపారి ఆ గ్రామానికి చేరి, అక్కడి ప్రజలకు ఆహార పదార్థాలు, నీటితో నిండిన పీపాలు పంచిపెట్టి తిరిగి వెళ్లాడు. పట్నంలో పెద్దసభ ఏర్పాటు చేసి, తను చేసిన పని గురించి వివరించి అందరి ప్రశంసలు పొందాడు.

మూడో వ్యాపారి తన మిత్రులు ఇద్దరూ ఆ గ్రామ ప్రజల కోసం చేసిన సాయాన్ని మెచ్చుకున్నాడు. 'మీలాగే నేను కూడా ఆ గ్రామానికి ఏమైనా చేయగలనేమో చూస్తాను' అని అక్కడికి బయలుదేరాడు. మిగతా ఇద్దరు వ్యాపారులూ అతనిని అనుసరించి వెళ్లారు.

మూడో వ్యాపారి, తన బండ్లలో వేసుకువచ్చిన వ్యవసాయ పనిముట్లు, బస్తాలలో విత్తనాలు అక్కడి ప్రజలకు, రైతులకు పంచిపెట్టాడు. ఇతరుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకుండా తమ ఆహారపదార్థాలను తామే స్వయంగా పండించుకుని బతికే శాశ్వత పరిష్కార మార్గం ఆలోచించి అలా చేసిన వ్యాపారి, తను చేసిన పనిని ఎవరికీ చెప్పకుండా, ప్రచారం చేసుకోకుండా మౌనంగా తన దారిని తాను పోయాడు.

'ఆకలిగొన్న వాడికి తినటానికి చేపను ఇచ్చే బదులు బతకటానికి చేపలు పట్టటం నేర్పాలి' అనే సామెత వారికి గుర్తుకు వచ్చింది. అతను చేసిన సాయం కష్టాలలో ఉన్న గ్రామస్తులకు ఇచ్చిన నిజమైన కానుక అని మిగిలిన వ్యాపారులిద్దరూ అతనిని అభినందించారు."

మూడో వ్యాపారి చేసిన పని నుంచి ఒక అంశాన్ని నేర్పించటం కోసమే ప్రధానంగా ఈ కథను పిల్లలకు అందిస్తున్నాం. కానీ అదే మూడో వ్యాపారి చేసిన పనిలాంటి రాజకీయం చేస్తున్న లోక్‌సత్తాకు ఓటు వేస్తున్నామా? తలెత్తుకుని బతకటానికి సాధనాలనిస్తూ ప్రజలకు నిజమైన కానుకనిచ్చిన లోక్‌సత్తాకు తాజాగా గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మనలో చాలామందిమి ఎందుకు ఓట్లు వేయలేకపోయాం? మన పిల్లలకు నేర్పిస్తున్న తెలివిని, సృజనాత్మకతను, విలువల్ని మనమే దెబ్బతీసేలా వ్యవస్థల్ని తయారుచేస్తున్నాం. అన్నిటికీ కీలకమైన రాజకీయాల్ని భ్రష్టుపట్టిస్తున్నాం. మనం చేస్తున్న పని సరైనదనుకుంటే, పిల్లలకు ఇలాంటి కథలు, పాఠాలు వద్దు. మనం చేస్తున్న పని తప్పు అనుకుంటే, ఇక మంచి రాజకీయానికే ఓటు వేద్దాం. ఆలస్యమవుతున్నకొద్దీ ఈ వైరుధ్యం వల్ల నష్టం పెరుగుతూంటుంది. ◈

# పౌరుల చుట్టూ తిరిగే కొత్త రాజకీయంతో దేశాధ్యక్ష పోటీలో సియోల్ మేయర్ పార్క్ వన్-సూన్



ఒకప్పుడు మనకంటే వెనకబడిన దేశమే అయినా పారిశ్రామిక ఉత్పత్తిరంగంలో మనకంటే దశాబ్దాల ముందే అవకాశాలను అందుకోవటం వల్ల దక్షిణ కొరియా పరిశ్రమల్లో, సాంకేతికతో మనకు పాఠాలు నేర్పుతోంది. దక్షిణ కొరియా రాజధాని సియోల్ జనాభా సుమారు 1 కోటి. పౌరుల భాగస్వామ్యమున్న కొత్త రాజకీయ పాలన అందించే దార్శనికుడు పార్క్ వన్-సూన్ ఈ ప్రపంచస్థాయి నగరానికి మేయర్‌గా వ్యవహరిస్తున్నారు.

హైదరాబాద్, విజయవాడలో పరిపాలన అనగానే మనం ముఖ్యమంత్రుల వైపు చూపించినట్టు (ఓటువేసినట్టు) కాకుండా సియోల్ అనగానే ఆ నగర మేయర్ పార్క్ వన్-సూన్ గురించే చెబుతారు. స్థానిక పాలనకున్న ప్రత్యేకతను అంత స్పష్టంగా గుర్తించిన దేశం దక్షిణ కొరియా. ప్రపంచంలోని చాలాచోట్ల పార్క్‌కి అభిమానులున్నారు. పౌరుని చుట్టూ తిరిగే రాజకీయంతో నగర పాలనను, రాజకీయాలను ప్రభావితం చేసిన నాయకుడిగా గౌరవిస్తారు. పార్క్ ఇంత దార్శనిక నాయకుడు ఎలా అయ్యారు?

పార్క్ వన్-సూన్ దక్షిణ కొరియాలో న్యాయవాది. విద్యార్థులు, కళాకారులు, ఖైదీలు, ఇలా సమాజంలో సమస్యలు ఎదుర్కొంటున్నవారి తరపున అలుపెరగని పోరాటం చేశారు. పురుషాధిక్య ప్రపంచంలో వేధింపులకు వ్యతిరేకంగా మహిళా ఉద్యోగులకు అండగా నిలిచారు. గుర్తించటం, పోరాటం చేయటం కష్టం అనిపించే సమస్యలను ఢీకొట్టారు. సామాజిక న్యాయం, మానవ హక్కుల కోసం దాదాపు మూడు దశాబ్దాల పాటు కృషి చేసిన చరిత్ర పార్క్‌కి ఉంది. 1970లో సియోల్ జాతీయ విశ్వవిద్యాలయంలో అప్పటి అధ్యక్షుడి విధానాలకి వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహించినందుకు కొన్ని నెలలపాటు జైలుకు కూడా వెళ్లారు. ఇలా నిస్సహాయుల తరపున పోరాటాలు చేసే క్రమంలో పార్క్‌కి సాక్షాత్కరించిన సత్యం -'నా దేశానికి పౌరసత్వం కావాలి.

ప్రజలు తమ సత్తాను పూర్తిస్థాయిలో పెంచుకుంటే నిజమైన పౌరులవుతారు, అలా పౌరసత్వం ఉన్న ప్రజలు నిరంతర చైతన్యంతో ఎప్పటికప్పుడు తగిన మార్పులు చేసుకుంటూ దేశాన్ని కాపాడుకుంటారు అని పార్క్ అర్థం చేసుకున్నారు. ఇక అక్కడ్నుంచి, పౌరసత్వంతో పరిష్కారాలు చేసే వినూత్న సామాజిక మార్పు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

ప్రభుత్వంపై వాచ్‌డాగ్‌లాగా పనిచేస్తూ రాజకీయ అవినీతికి వ్యతిరేకంగా పోరాడటానికి 1994లో 'పీపుల్స్ సాలిడారిటీ ఫర్ పార్టిసిపేటరీ డెమోక్రసీ' స్వచ్ఛంద సంస్థను పార్క్ స్థాపించారు. తర్వాత వలంటీరిజం, కమ్యూనిటీ సేవను పెంపొందిస్తూ ఆదాయ అంతరాలపై పోరాడేందుకు ది బ్యూటిఫుల్ ఫౌండేషన్‌ను నిర్వహించారు. ఆ తర్వాత సామాజిక, విద్య, పర్యావరణ, రాజకీయ సమస్యలకి సమాజంలో దిగువస్థాయి నుంచి వచ్చే పరిష్కారాల ప్రాతిపదికగా విధానాలను రూపొందించే హోప్ ఇన్‌స్టిట్యూట్‌ని స్థాపించారు. కొరియాలో జపాన్ పాలనలో జరిగిన అకృత్యాలపై విచారణ కమిషన్‌కు నేతృత్వం వహించినా, జపాన్‌లోని స్థానిక స్వయంపాలన వ్యవస్థలను పార్క్ ఎంతగానో మెచ్చుకున్నారు.

ఇలా ప్రజల హక్కుల కోసం పోరాడుతూ, పౌరసత్వాన్ని పెంచుతూ దక్షిణ కొరియా రాజధాని సియోల్ మేయర్‌గా ఎదిగారు పార్క్ వన్-సూన్. 2011 నుంచి రెండుసార్లు మేయర్‌గా ఎన్నికయ్యారు. డెమోక్రాటిక్ పార్టీ, డెమోక్రాటిక్ లేబర్ పార్టీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి పార్క్ గెలవటం సాంప్రదాయ జాతీయ పార్టీలకు సవాలుగా మారింది.

పౌరుల భాగస్వామ్యం ఉండే 'కొత్తతరహా పాలన' అందిస్తానన్న హామీతో పార్క్ ఎన్నికలలో గెలిచారు. పౌరుల సూచనలు వినటానికి, పౌరులతో సంభాషణ, చర్చలు జరిపి వారిని పాలనలో భాగస్వాముల్ని చేయటానికి రౌండ్‌టేబుల్ సమావేశాలను, ఏకాభిప్రాయ సదస్సులను, పౌర సమావేశాలను, విధానాల కార్యక్రమాలను పార్క్ వ్యవస్థీకృతం చేశారు. ఫలితంగా 2014లో సామాజిక సృజనాత్మక ప్రాజెక్టులలో 1,00,000మంది నగర పౌరులు భాగస్వాములయ్యారు. సియోల్ సుస్థిర అభివృద్ధికి ఒక కమిటీ లోతైన అధ్యయనం చేసి మాస్టర్ ప్లాన్‌ను తయారుచేసింది.

సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా పౌరసమాజం ద్వారా మార్పు కోసం చేసిన కృషిలో తనకున్న అనుభవాలతో.. ప్రభుత్వం, మార్కెట్, పౌరసమాజం మధ్య నిజమైన సహకారం, సమన్వయం ఉండేలా కార్యాచరణను అమలుచేస్తూ మేయర్‌గా పార్క్ వినూత్నంగా సియోల్ సమస్యలను పరిష్కరిస్తున్నారు. పౌరుల సూచనల్ని, పరిష్కారాలను తీసుకుంటూ పాలనలో ప్రభుత్వ యంత్రాంగంతో పోటీపడేలా వారిని భాగస్వాముల్ని చేశారు.

పౌరుల భాగస్వామ్యమున్న బడ్జెట్ విధానాన్ని అమలుచేస్తున్నారు. పౌరుల ఆలోచనలకు అమలుకు తగినన్ని నిధుల్ని కేటాయిస్తున్నారు.

'సియోల్ నూతన ఆలోచనల ప్రణాళికా విభాగాన్ని' ఏర్పరిచారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొత్త ఆలోచనల్ని సేకరించి, అధ్యయనం చేసి సియోల్‌కు ఏ విధంగా అన్వయించవచ్చో చెప్పటం ఈ విభాగం పని.

సియోల్ నగర సమాజంలో భిన్న వర్గాల ప్రయోజనాలను సమన్వయం చేసే క్రమంలో సియోల్ 'నూతన సామాజిక ఆలోచనల పార్కు'ని మేయర్ పార్క్ నెలకొల్పారు. ఇందులో సియోల్ సోషల్ ఎకానమీ సెంటర్, సియోల్ కమ్యూనిటీ సపోర్ట్ సెంటర్, సియోల్ క్రియేటివ్ ల్యాబ్, ది యూత్ హబ్ వంటి సంస్థలు ఆలోచనల్ని వనరులకనుగుణంగా మథించి సామాజిక సంఘటిత అభివృద్ధి కోసం పనిచేస్తుంటాయి.

పర్యావరణం, జనాభా పెరుగుదల సహా సియోల్ సమస్యలపై సమగ్ర అవగాహనతో మాట్లాడుతూ ప్రజలందరినీ పరిష్కారంలో భాగం చేసే కొత్త రాజకీయంతో అంతర్జాతీయంగా గుర్తింపుపొందిన పార్క్ వన్-సూన్ వామపక్ష-ఉదారవాద కూటమి తరపున 2017లో దక్షిణ కొరియా అధ్యక్ష పదవికి పోటీపడతారని భావిస్తున్నారు. ◈

# లోక్‌సత్తా పౌర సహాయ కేంద్రం ప్రారంభం

హైదరాబాద్ దోమలగూడలో లోక్‌సత్తా పార్టీ పౌర సహాయ కేంద్రం ప్రారంభమైంది. పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డా॥ పాండురంగారావు ఎన్టీఆర్ స్టేడియం ఎదురుగా గల కార్యాలయంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. రాజకీయమంటేనే ప్రజాసమస్యలను పరిష్కరించటమని, అవి పరిష్కరించటంలో తగిన సహాయసూచనల్ని అందించటమే పౌర సహాయ కేంద్రాలు చేసే పని అని ఈ సందర్భంగా అన్నారు. లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ పౌర సహాయ కేంద్ర నిర్వాహకుడు కొంగర గంగాధరరావు మాట్లాడుతూ, పౌరులు ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పొందాల్సిన సేవలకు లంచాల్ని, వేధింపుల్ని, అవమానాల్ని, అసహనాన్ని ఎదుర్కొంటున్నారని, వాటిని అధిగమించి ప్రజలే ప్రభువులు- పాలకులు, అధికారులు సేవకులే అని ఆచరింపచేసేందుకు పౌర సహాయ కేంద్రం తోడ్పడుతుందని అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించవలసిందిగా కోరారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జీహెచ్ఎంసీ ఉపాధ్యక్షురాలు గంగా భవానీ, ముషీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు అనమోలు రాఘవయ్య, పార్టీ నేతలు నరేందర్ రెడ్డి, అశేర్ భాయ్, రాఘవేంద్ర గౌడ్, మైఖేల్ రాజ్ కమటం, ఎమెరాల్డ్, శాంసన్, అంబర్‌పేట నాయకుడు వెంకటేష్, నరసింహ దొంతినేని తదితరులు పాల్గొన్నారు. ◈

# విచ్చలవిడి మద్యం అమ్మకాలు చేస్తున్న పాలకులు గవర్నర్‌కి కనిపించరా?

రాష్ట్రంలో విచ్చలవిడి మద్యం అమ్మకాలు సాగిస్తూ పాలకులే రాజ్యాంగస్ఫూర్తిని కాలరాస్తుంటే గవర్నర్ నరసింహన్ పుణ్యక్షేత్ర దర్శనానికి వచ్చి ప్రభుత్వానికి కాకుండా ప్రజలకు మద్యం తాగొద్దంటూ నీతులు చెప్పటం హాస్యాస్పదమని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అన్నారు. రాష్ట్రంలో 2004-05లో రూ.2,367 కోట్లుగా ఉన్న మద్యం ఆదాయం ఈవేళ రూ.10,927కోట్లకు చేరిందని, ప్రజలను కాపాడాల్సిన గవర్నర్ ప్రజావ్యతిరేక విధానాలను అమలుచేస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికికాకుండా ప్రజలకు పాఠాలు చెబుతున్నారని మీడియా సమావేశంలో ధ్వజమెత్తారు. విజయవాడలోని ఓ రాజకీయ నేత బార్‌లో కల్తీ మద్యం తాగి అమాయకులు చనిపోయిన ఘటనపై గవర్నర్ నోరు మెదపలేదన్నారు. తెలంగాణ, ఏపీలో మద్యం అమ్మకాలతో సాగుతున్న దుష్పరిపాలనను ప్రశ్నించకుండా గవర్నర్ హరిదాసు పాత్రను పోషిస్తున్నారన్నారు. ◈

# అవినీతిని ఎన్టీఆర్ ద్వేషించేవారు,

## కారు కోసం రూ.3-4 లక్షల ప్రజాధనం ఖర్చుకూ ఒప్పుకోలా : జేపీ

***ప్రజలిచ్చిన అధికారాన్ని సేవ కోసం కాకుండా అవినీతి సొమ్ము కోసం వాడుకునేవాళ్లని ఆయన ఎంత అసహ్యించుకునేవారో చెప్పటానికి ఉదాహరణలున్నాయి. ఆ వివరాలు చెప్పను. అవసరం లేదు. కొంతమంది మంత్రులు ఇప్పటితో పోలిస్తే చాలాచిన్న స్థాయి అవినీతికి ట్రాన్స్‌ఫర్లు వంటి వాటిలో రూ.3-4లక్షలకు పాల్పడితే వాళ్లను ఎంత తీవ్రస్థాయిలో ఎన్టీఆర్ మందలించారో నేను కళ్లారా చూశాను. ఆ మంత్రులు వణికిపోయారు.***



ఎన్‌టిరామారావుకి అవినీతి అంటే నరనరాల కంపరం, అసహ్యం. ఎవరు అవినీతికి పాల్పడినా ఆయన సహించలేరు. ప్రజలు ఇంతగా నమ్మి మిమ్మల్ని అధికారంలో కూర్చోబెడితే– రాజకీయ అధికారంలో కావచ్చు, ప్రభుత్వోద్యోగిగా పాలనాధికారంలో కావచ్చు– దాన్ని దుర్వినియోగం చేసి ప్రజల దగ్గర లంచం తీసుకోవటం కంటే నికృష్టమైన పని ఇంకోటి లేదు. దాన్ని ఎన్టీఆర్ తీవ్రంగా ద్వేషించేవారు. ఆయన అవినీతిని వ్యతిరేకించేవారు అనేది చాలా చిన్నమాట. దాన్ని ద్వేషించేవారు.

దాంతో కొన్ని సందర్భాల్లో ఏమయ్యేదంటే, ఎవరో ఆయన దగ్గరకు పోయి ఎవరిపైనైనా అవినీతి ఆరోపణలు చెబితే వెంటనే కోపం తెచ్చుకునేవారు. దానిగురించి నిజానిజాలు ఆయనకు తెలియకపోవచ్చు. ఈరకంగా అవినీతిపై ఆయనకున్న ద్వేషాన్ని ఉపయోగించుకునేవారు కూడా కొంతమంది ఉండేవాళ్లు. కానీ ఎట్టిపరిస్థితుల్లోనూ అవినీతిని ఆయన దరిదాపులకు కూడా రానిచ్చేవారు కాదు. ఆయన నాకే స్వయంగా చెప్పారు– తన చదువు పూర్తయిన మొదటిరోజుల్లో సబ్‌రిజిస్ట్రార్‌గా ఉద్యోగం వస్తే సూటూబూటూ వేసుకుని వెళ్లేవారట. కోటు తీసి కుర్చీకి తగిలించి మళ్లీ సాయంత్రం వేసుకునేవారు. ఒకరోజు కోటు వేసుకుంటుండగా జేబులో డబ్బు కనిపించింది. ఇదేంటంటే, ఇది మామూలే అన్నారట. 'ఇలాంటి డబ్బు నాకు వద్దని తిరిగిచ్చేయటమే కాదు జయప్రకాష్ గారూ, ఉద్యోగం కూడా వదులుకుని చెన్నపట్నం బండెక్కాను. ఆ రకంగా సినిమా రంగంలోకి వచ్చాను' అని ఎన్టీఆర్ చెప్పారు.

ప్రజలిచ్చిన అధికారాన్ని సేవ కోసం కాకుండా అవినీతి సొమ్ము కోసం వాడుకునేవాళ్లని ఆయన ఎంత అసహ్యించుకునేవారో చెప్పటానికి ఉదాహరణలున్నాయి. ఆ వివరాలు చెప్పను. అవసరం లేదు. కొంతమంది మంత్రులు ఇప్పటితో పోలిస్తే చాలాచిన్న స్థాయి అవినీతికి ట్రాన్స్‌ఫర్లు వంటి వాటిలో రూ.3–4లక్షలకు పాల్పడితే వాళ్లను ఎంత తీవ్రస్థాయిలో ఎన్టీఆర్ మందలించారో నేను కళ్లారా చూశాను. ఆ మంత్రులు వణికిపోయారు.

నాకు బాగా గుర్తుంది 1994 చివర్లో ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చాక ఆయన కార్యాలయంలో ఉండమంటే మొదట నేను తటపటాయించినా అంగీకరించాను. అక్కడికొచ్చిన కొద్దిరోజుల్లోనే ఇంటెలిజెన్స్‌వారు నా దగ్గరికొచ్చి– 'ముఖ్యమంత్రిగారి కారు చాలా పాతది. పికప్ లేదు. భద్రతావాహనాలతో సమాన వేగం ఉండటం లేదు. ముఖ్యమంత్రిగారు అత్యంత ప్రజాదరణ గల వ్యక్తి, ప్రమాదాలు పొంచి ఉంటాయి. కాబట్టి కొత్త కారు తీసుకుంటే మేలు' అని గట్టిగా చెప్పారు. నేను ఎన్టీఆర్‌కి చెప్పాను. అప్పటికే ఆయన సంపూర్ణ మద్యనిషేధం అమలు చేస్తుండటంతో ఖజానాకు భారీగా ఆదాయనష్టం వస్తోంది. అయినా సమాజం బాగు కోసం ఎన్ని కోట్లు పోయినా ఫర్వాలేదని రామారావు మొండిగా

మద్యనిషేధాన్ని అమలు చేశారు. ఆరోజుల్లో డీలక్స్ అంబాసిడర్ కొనాలంటే రూ. 3-4లక్షలు ఖర్చవుతుంది. అయినా కొత్తకారు కొనటానికి ఎన్టీఆర్ అంగీకరించలేదు. ఇప్పుడు రూ. 4లక్షల డబ్బు ఖర్చు ఎందుకు జయప్రకాష్ గారూ, ఉన్న కారుని రిపేరు చేయిస్తే చాలు అన్నారు.

అలాగే నడిపించారు. రిపేరు చేయించారో లేదో కూడా నాకు గుర్తులేదు. ఇప్పుడు మంత్రులు, ముఖ్యమంత్రి, చివరికి ఎమ్మెల్యేలు కూడా పదవులంటే రాజభోగాలు అనుకుంటూ ప్రజల డబ్బును విచ్చలవిడిగా ఖర్చుచేస్తుంటే, ముఖ్యమంత్రి స్థాయిలోని ఎన్టీఆర్, అందులోనూ ప్రజాదరణ విశేషంగా పొంది అధికారంలోకి వచ్చిన నిఖార్సయిన స్థాయిలో ఉన్నా రూ. 3-4 లక్షల ప్రజాధనం తన కారు కోసం ఖర్చుపెట్టటానికి అంగీకరించలేదు. భద్రత దృష్ట్యా అవసరముందని చెబుతున్నా సరే. అలాంటి వ్యక్తులు, నాయకులు ఉన్నారంటే, బహుశా ఈవేల్టితరం ఆశ్చర్యపోతుంది.

మద్యనిషేధం సమయంలో మద్యం ఉత్పత్తి చేసే డిస్టిలరీలను ఉంచాలా మూసేయాలా అనే సమస్య వచ్చినప్పుడు కూడా ఎన్టీఆర్ ఆదాయాన్ని చూసుకోలేదు. మొలాసిస్ నుంచి మద్యం ఉత్పత్తి చేసే డిస్టిలరీల్లో 50,000 మంది ఉపాధి పొందుతున్నారు, మన పరిశ్రమలకు, ఇతర రాష్ట్రాలకు మద్యం ఎగుమతి చేయటానికి డిస్టిలరీలు అవసరం, రూ. 100 కోట్ల ఆదాయం వస్తుందని ఒక వాదనరాగా, మద్యనిషేధం అమలు చేస్తున్న రాష్ట్రంలో మద్యం తయారీ ఉండకూడదు అని మరో వాదన వచ్చింది. 'ఆదాయం తక్కువగా ఉన్నప్పుడు రాష్ట్రానికి వచ్చే ప్రతి రూపాయీ విలువైనదే, మద్యనిషేధం వేరు, మద్యంతయారీ వేరు' అని నేను కూడా చెప్పాను. కానీ రాజకీయ నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత ఎన్టీఆర్‌ది కాబట్టి ఆ ఫైలు మీద సంతకం పెట్టాల్సిన రోజున 'పోతేపోనీండి జయప్రకాష్ గారూ. ప్రజల కోసం వెయ్యికోట్ల ఆదాయాన్నే వదులుకున్నాం, ఈ వందకోట్లు వదులుకోలేమా?' అని డిస్టిలరీలను ఎన్టీఆర్ రద్దుచేశారు. తన సొంత ఖర్చుకు రూ. 3-4లక్షలు తీసుకోవటానికి తటపటాయించిన వ్యక్తి, ప్రజల సంక్షేమం కోసం ఎన్ని వందల కోట్లు పోయినా ఫర్వాలేదనటం- ఈ రెండూ ఒకే మనిషిలో ఉండటం చాలా అరుదైన విషయం.

ఆ రోజుల్లో అడపాదడపా తుంగభద్ర నీటిపై కర్ణాటకతో



ఆంధ్రప్రదేశ్‌కి గొడవలు వస్తుండేవి. తుంగభద్ర నీళ్లు సరిగా అందనివ్వకుండా కర్ణాటక అడ్డుకుంటోందని రాయలసీమ రైతులు ఆందోళనతో ఫిర్యాదు చేశారు. అదేసమయంలో కర్ణాటక ముఖ్యమంత్రిగా ఉన్న దేవెగౌడ తొందరపాటుతనంతో ప్రాజెక్టు వద్దకు వెళ్లి ఒక్క చుక్క నీటిని కూడా పోనివ్వబోమని హెచ్చరికలు చేశారు. దీంతో 20-30మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎన్టీఆర్ వద్దకు వచ్చి, 'మీరు ఒక్కసారి అనుమతివ్వండి అన్నగారూ, వందలవాహనాల్లో వెళ్లి నీళ్లు ఎట్లా ఇవ్వరో చూస్తాం' అన్నారు. అక్కడే ఉన్న నేను ఖంగారు పడ్డాను. శాశ్వతంగా పొరుగున ఉండే కర్ణాటకతో మనం నీటి సమస్యను సామరస్యంగానే పరిష్కరించుకోవాల్సుంటుంది. అందులోనూ ఇలాంటి అంశాల మీద నిర్ణయించేటప్పుడు నా రాష్ట్రం, నా ప్రాంతం అని కాకుండా కొంత జాతీయవాదం కూడా కావాలి. ముఖ్యమంత్రి ఎక్కడ ఆవేశపడి ఏమంటారోనని నేను ఖంగారుగా, ఆందోళనగా ఉన్నాను. ఏమన్నా చెబుతామంటే, చుట్టూ అనేకమంది నాయకులు ఉన్నారు. కానీ గర్వించదగ్గ రీతిలో ఎన్టీఆర్ ప్రతిస్పందించారు. 'కర్ణాటక మన రాష్ట్రం కాదా? మన దేశం కాదా? దేవెగౌడ వద్దకు నేను మనుషుల్ని పంపి ఆయన గౌరవానికి కూడా భంగం వాటిల్లకుండా సమస్యను పరిష్కరిస్తా. నేను కూడా ఆవేశంగా మాట్లాడి రెచ్చగొడితే రాష్ట్రం అల్లకల్లోలమవుతుంది, దేశంలో రక్తపాతం చెలరేగుతుంది. నేను మాట్లాడి పరిష్కరిస్తా' అంటూ నచ్చచెప్పి నేతల ఆవేశాన్ని అదుపుచేశారు. అది కూడా ఎవరి సలహాలు లేకుండా. ఒక ప్రాంతీయ పార్టీకి చెందిన ఎన్టీఆర్‌లో అంతటి జాతీయభావాలున్నాయనే విషయం చాలామందికి తెలియదు.

(ఎన్టీఆర్ 20వ వర్ధంతి సందర్భంగా 'కొరడా డాట్‌కామ్'కు జేపీ ఇచ్చిన ఇంటర్వ్యూ నుంచి) ◈


# అవినీతిని ప్రజలపైకే నెట్టేసే పలాయనవాదం

అవినీతికి వ్యతిరేకంగా లోక్‌పాల్ చట్టం రావాలని పోరాటం చేసిన 'ఇండియా ఎగనెస్ట్ కరప్షన్' ఉద్యమాన్ని రోజుల తరబడి ఏకధాటిగా ప్రచారం చేసిన జాతీయ మీడియా ఈవేళ అవినీతిపై పోరాటం ఎలా ఉందో ఆలోచించే ప్రయత్నం కూడా చేయటం లేదు. తరచిచూస్తే అరవింద్ కేజ్రీవాల్ అనే సామాజిక కార్యకర్త ఢిల్లీ ముఖ్యమంత్రి కాగలగటం మినహా ఇండియా ఎగనెస్ట్ కరప్షన్ ప్రచారం అవినీతిని ఆపలేకపోయిందని అర్థమవుతోంది. చివరకు కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా ఏడాది పూర్తిచేసుకున్న ఢిల్లీలో కూడా ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఏమాత్రం తగ్గలేదని 77శాతం అభిప్రాయపడుతున్నట్టు ఓ సర్వే వెల్లడించింది.

భారత్‌లో అవినీతి యధాతథంగా కొనసాగుతోందని జర్మనీకి చెందిన ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ ఇటీవల విడుదల చేసిన 'ప్రపంచ దేశాల అవినీతి సూచి' కూడా తేల్చింది. భారత్‌కు అంతకుముందు ఏడాదిలాగే ఈ ఏడాది సూచిలోనూ 38 మార్కులే వచ్చాయి. అవినీతిని నిర్మూలిస్తా మంటూ భారత్‌లో నాయకులు చేసిన హామీలు అమల్లోకి రావటం లేదని ట్రాన్స్‌పరెన్సీ సంస్థ తెలిపింది. అయితే ఈ అవినీతి ఇలా కొనసాగటాన్ని ఇండియా ఎగనెస్ట్ కరప్షన్ ఉద్యమం సర్వరోగ నివారిణిగా అభివర్ణించిన లోక్‌పాల్ సహా చట్టబద్ధమైన సంస్థలు ఎన్ని ఉన్నా ఆపలేవని కేంద్ర నిఘా విభాగం కమిషనర్ (సీవీసీ) కేవీ చౌదరి తాజాగా వ్యాఖ్యానించారు.

అవినీతి ఉండకూడదని ప్రజలు తమకు తాము నిర్ణయించుకున్నప్పుడే పరిస్థితి మారుతుందని సీవీసీ అంటున్నారు. లోకాయుక్త, లోక్‌పాల్, అవినీతి నిరోధక విభాగం పనిచేస్తున్నప్పటికీ దేశంలో అవినీతి విస్తరించిందన్నారు. ప్రజలు మనసు మార్చుకుని అవినీతికి దూరంగా ఉండాలనుకున్నప్పుడే ఇది సాధ్యమవుతుందన్నారు. అంతేగానీ ఏ సంస్థలూ దేశాన్ని కాపాడలేవన్నారు. లంచాలు ఇవ్వకుంటే తాగునీటి కనెక్షన్, రేషన్ కార్డు లాంటి చిన్నచిన్న పనులు కూడా సకాలంలో జరగకపోవటంపై ప్రజలు అసహనంతో ఉన్నారన్నారు. అవినీతిని తగ్గించటానికి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఏటా సుమారు 75,000 ఫిర్యాదులు అందుతున్నాయని, ఇవి ప్రతిఏటా 10శాతం పెరుగుతున్నాయని సీవీసీ అన్నారు.

చౌదరి గారూ! ప్రజలే వ్యవస్థని నడిపించగలిగితే ఇక నాయకులు, అధికారులు చేసేదేమిటి? నిజాయతీలో భారతీయులు మిగతా ప్రపంచ దేశాలవారెవరితోనూ తీసిపోరని ఒకప్పుడు వెలువడిన నివేదికలు ఇప్పుడు పనికిరావని, భారతీయులందరూ అవినీతిపరులుగా తయారయ్యారనే అనుకుందాం. అయితే ఇక మనదేశంలో అవినీతి పోవటాన్ని 'కర్మ' సిద్ధాంతానికి వదిలేయాల్సిందేనా? దానంతటది పోవాల్సిందే తప్ప నాయకులు, వ్యవస్థలు చేసేదేమీ లేదా? నల్లధనం వెనక్కి తెస్తామని, ఒకే ఒక్క చట్టంతో అవినీతిని అంతం చేస్తామని పోరాటాలు, ప్రతిజ్ఞలు చేసిన పోరాటాలు, వారిని ఆకాశానికెత్తేసిన మీడియా, వారికి ఆవేశంతో మద్దతు పలికిన




మధ్యతరగతి, ఓట్లు వేసిన ప్రజలు వీరెవ్వరికీ నిజానికి అవినీతిని అంతం చేసే లక్ష్యం లేదా? అధికారం, ప్రేక్షకులు, సర్క్యులేషన్ ఇలా అవసరార్థం లేదా పైపైన ఆవేశంతో మాత్రమే అవినీతిపై పోరును చేపట్టారా?

నిజానికి మన బంగారం మంచిదైతే ఎవరినీ అనాల్సిన పనిలేదు. మన ప్రజలు ఆలోచనతో ఓటు వేసే పరిస్థితి ఉంటే నాయకులు, పార్టీలు, అధికారులది, మీడియాది ఏముంది, వాళ్లను కౌన్ కిస్కాలకింద తీసిపారేసి మనం చకచకా మార్పులు తెచ్చేసుకోవచ్చు. కానీ భారతదేశానికి తగ్గ వ్యవస్థల్ని, ఎన్నికల విధానాన్ని నిర్మించకుండానే అందరికీ వయోజన ఓటుహక్కునిచ్చాం. ఆ తర్వాతైనా మన ప్రజలకు మంచి చదువిచ్చామా? కుల, మత, ప్రాంత, లింగ వివక్షలు లేకుండా తలెత్తుకుని బతికేందుకు కావలసిన ఉపాధిని, సమాజాన్ని అందించామా? తప్పు చేస్తే శిక్ష తప్పదు, మంచి చేసినవారికి ప్రోత్సాహం ఉంటుంది అనేలా చట్టబద్ధ పాలన అమలు చేశామా? ఇవన్నీ చేశారు కాబట్టే ప్రపంచదేశాల అవినీతి సూచిలో

అతి తక్కువ అవినీతి ఉన్న దేశంగా 91 మార్కులతో వరసగా రెండోసారి డెన్మార్క్ అగ్రస్థానంలో నిలిచింది. అక్కడి ప్రజలు స్వచ్ఛందంగా అవినీతికి దూరంగా ఉంటారు. ఇవేమీ చేయకుండా, చేసే ప్రయత్నం కూడా చేయకుండా, వీలున్నంత మేర ప్రజల్ని కూడా అవినీతిపరులుగా తయారుచేసే విధంగా తాత్కాలిక పథకాలను అమలు చేస్తూ, తెల్ల రేషన్ కార్డుల్ని జారీచేస్తూ 'యధా ప్రజా తధా రాజా' అనటం చాలా దుర్మార్గపు రాజకీయ, మేధో క్రీడ.

డెన్మార్క్‌లోలా సామాజిక, ఆర్థిక పరిస్థితుల్ని కల్పించలేనప్పుడు మనం ఏం చేయాలి? ప్రజల్లో స్వభావసిద్ధంగా, సంస్కృతిపరంగా అవినీతికి వ్యతిరేకంగా ఉండే ధోరణుల్ని బలోపేతం చేస్తూ, అవినీతి పోవాలని వారిలో ఉన్న బలమైన ఆకాంక్ష కార్యరూపంలో ప్రదర్శించగలిగేలా ఏర్పాట్లను చేయాలి. అవినీతి అంతమవుతుందనే విశ్వాసాన్ని పెంచేలా కొన్ని అవినీతి నిరోధక చట్రాలను వారికి అందించాలి. రెక్కాడితేగానీ డొక్కాడని ప్రజలు నిస్సహాయ స్థితిలో లంచం ఇవ్వాల్సిన పరిస్థితులు లేకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో ధ్రువపత్రాలు, తాగునీటి కనెక్షన్లు, భూ రికార్డులు వంటి రోజువారీ సేవలు సకాలంలో అందించేలా, ఒకవేళ అందించలేకపోతే రోజుకు రూ.250 జరిమానా విధించేలా 'సర్వీస్ గ్యారంటీ' చట్టాన్ని అమలుచేయాలి. స్థానికంగా వచ్చే ఆదాయం, చేసే ఖర్చు, ప్రాథమ్యాలు అన్నీ ప్రజల భాగస్వామ్యంతో జరిగేలా స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు బదిలీ చేయటంతోపాటు మునిసిపల్ వార్డు స్థాయికి, గ్రామ పంచాయతీస్థాయికి తలసరి ప్రతి పౌరుని పేరా రూ.1000-2000 కేటాయిస్తే అవినీతి లేకుండా ప్రజలే చూసుకోగలుగుతారు. అయినా అవినీతి ఉంటే చర్యలకు జిల్లా స్థాయిలో అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేయాలి. జాతీయస్థాయిలో బలమైన లోక్‌పాల్, రాష్ట్రాల్లో బలమైన లోకాయుక్తలు, జిల్లాలో అంబుడ్స్‌మన్‌లు ఉండటంతోపాటు అధికార వికేంద్రీకరణ, ప్రభుత్వ కార్యాలయాల్లో సర్వీస్ గ్యారంటీ చట్టం ఉంటే, కొంతమందికైనా కఠిన శిక్షలు ఉంటే అవినీతి దానంతటదే తగ్గుముఖం పడుతుంది. ఇవన్నీ చేశామా చౌదరి గారూ?

అలాగే జాతీయస్థాయిలో సీబీఐకి, రాష్ట్రాల్లో ఏసీబీకి జవాబుదారీతనం గల స్వయంప్రతిపత్తినిచ్చామా? నా ఏసీబీ, నా పోలీసులు అని ఓటుకు కోట్లు కేసులో వీరంగం చేసిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, కె. చంద్రశేఖరరావు చివరికి లాలూచీ పడి ఆ కేసుని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. పాలనలో ఇన్ని లసుగులు పెట్టుకుని, సామాజికంగా, ఆర్థికంగా ఇన్ని తప్పిదాలు చేస్తూ ప్రజలే చేయాలి అనటం ఎంతవరకు న్యాయం? అది ఆచరణసాధ్యమేనా? ఆ స్థితి వచ్చేలోగా ఎంత వినాశనం జరుగుతుందో మీబోటివారికి తెలియదా సీవీసీ గారూ?

లోక్‌పాల్ సర్వరోగ నివారిణి కాదు అని లోక్‌సత్తా ఎప్పటినుంచో చెబుతూ పైన చెప్పిన మార్పులతోపాటు రాజకీయ అవినీతికి మూలమైన పార్టీల నిధుల సేకరణ చట్టం, దామాషా ఎన్నికల వ్యవస్థ వంటి సంస్కరణల కోసం కూడా బహుముఖ కృషి చేస్తోంది. చట్టాల వల్ల ఉపయోగం లేదు అంటూనే, 'శాసనం ద్వారా ఎన్నికైన' అని ప్రమాణ స్వీకారం చేసే వాళ్లు అంత దోపిడీని, పెత్తనాన్ని చేస్తుంటే ప్రేక్షకుల్లా చూస్తున్నాం. నీరుగార్చే వ్యాఖ్యానాలు చేస్తున్నాం. ఈ పరిష్కారాలను సాధించగలవారిని ప్రజలు ఎన్నుకోలేకపోవటం దురదృష్టకరమేగానీ, అధికారంలో ఉన్నవాళ్లు మహాఅయితే వ్యక్తిగత నిజాయతీని ప్రదర్శించగలరు తప్ప వ్యవస్థీకృత నిజాయతీ సాధ్యం కాదు, అంతా ప్రజలు, కాలమే తేల్చాలి అని చెప్పటం మభ్యపెట్టటమే, పలాయనవాదమే.

ఇక పౌర సమాజంలో, మీడియాలో కూడా కొంతమంది మిత్రులు తమకు సౌకర్యవంతంగా ఉండటం కోసం అవినీతి డబ్బును ఎన్నికల సమయంలోనైనా ఖర్చుచేస్తున్నారు, ప్రజలకు పంచుతున్నారు కాబట్టి.. అంటూ అవినీతి రాజకీయాన్ని ప్రోత్సహిస్తున్నారు. పైకి విప్లవాలు మాట్లాడుతూ అవినీతి రాజకీయంలో భాగస్వాములవుతున్నారు. మంచి రాజకీయానికి తూట్లు పొడుస్తున్నారు. అవినీతి డబ్బును తిరిగి పంచుతున్నారా లేదా అనే అంశాన్ని పక్కనపెడితే, నీతిలేని ఆలోచనాతీరు సమాజానికి, అంతిమంగా ఆ వ్యక్తికి కూడా తీవ్ర హానికరం. ఏది నీతి, ఏది అవినీతి అనేది కూడా ఇక్కడ చర్చ కాదు. నీతి, అవినీతి అని మనం హేతుబద్ధంగా భావించి అంగీకరించే అంశాలకు మనం లోబడకపోతే, వినాశనం తప్పదు. అందుకే అవినీతి అనేది మానవ ఆలోచన నుంచే తొలగించాలి. దాన్నుంచి బైటపడాలే తప్ప దానితో సహజీవనం ఆచరణ సాధ్యం కాదు. లేకుంటే, అవినీతి, ఆ ఆలోచనాధోరణి పేదలనే కాదు, చివరికి ప్రజాస్వామ్యాన్ని కూడా కబళిస్తుంది. ఎందుకంటే, ప్రజాస్వామ్యం అంటేనే ఇతరుల పట్ల నైతికమైన, న్యాయబద్ధమైన ఆలోచనాతీరు. న్యాయంగా, ధర్మంగా వ్యవహరించకపోతే ప్రజాస్వామ్యమే ఉండదు. అవినీతి డబ్బులో వాటా లాగగలుగుతున్నాం కాబట్టి అవినీతిపరుల్ని ప్రోత్సహించటంలో తప్పులేదనుకోవటం ఆత్మవంచన, అప్రజాస్వామిక ధోరణే అవుతుంది. అవినీతిపై యధా ప్రజా తధా రాజా అని తప్పించుకోకుండా, కనీస లక్షణంగా ఉండాల్సిన వ్యక్తిగత నిజాయతీయే గొప్ప అని భావించకుండా, వ్యవస్థీకృత పరిష్కారాల కోసం ప్రభుత్వంలో ఉన్న నిజాయతీపరులు, పౌరసమాజం, మీడియా బహుముఖ కృషి చేయటం అవసరం. ఇక అన్ని వనరులూ ఉండి కూడా ఇటీవలి జీహెచ్ఎంసీ ఎన్నికల్లోలాగా అవినీతిపరులకు ఓటు వేస్తున్నవారు.. తమ పిల్లలకపాఠ్యపుస్తకాలలో 'నిజం చెప్పండి, నీతిగా బతకండి' వంటి పాఠాలను తొలగించటం గురించి ఆలోచించుకోవాలి. ◈

# అవినీతిపై 'న్యాయ' యుద్ధం

- మహేష్ విజాపుర్కార్

ప్రభుత్వం అవినీతి భూతాన్ని నియంత్రించలేనట్టయితే, పన్నుల చెల్లింపునకు వ్యతిరేకంగా పౌరులు సహాయనిరాకరణ ప్రారంభించాలని బాంబే హైకోర్టుకు చెందిన నాగపూర్ బెంచ్ న్యాయమూర్తి అరుణ్ చౌదరి గతవారం పేర్కొన్నట్టు 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా' నివేదించింది. న్యాయమూర్తి సలహా మాత్రమే ఇచ్చి ఉంటే అది చర్చనీయాంశమై ఉండేది. కానీ అది నిశ్చితంగా న్యాయమూర్తి వివేచన పెట్టిన ధర్మాక్రోశం.

దళిత దయాస్పోరాకు చెందిన ఒక విభాగమైన మాతంగ సామాజికవర్గం హక్కులను సముద్ధరించాలని ఆదేశించిన నేపథ్యంలో, మహారాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్ నుంచి నిధుల దుర్వినియోగ కేసులో ఒక నిందితుడు పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చిన సందర్భంగా న్యాయమూర్తి చౌదరి ఈ వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వాన్ని దృష్టిలో పెట్టుకుని జడ్జి ఈ వ్యాఖ్యను చేసినప్పటికీ, దేశంలోని అన్ని




**అవినీతిని నియంత్రించలేకపోవటమేకాదు, ప్రభుత్వం తాను చేయాల్సిన ఏ మౌలిక సేవాబాధ్యతని నెరవేర్చకపోయినా తాము చెల్లించిన పన్నుల డబ్బుల్ని తిరిగి ఇవ్వాలని శాంతియుతంగా ఉద్యమించే హక్కు ప్రజలకు ఉంటుందని లోక్‌సత్తా పలుమార్లు స్పష్టం చేసింది. ఇతరుల ప్రజాస్వామిక హక్కులను కాలరాసే రాస్తారోకోలు, ధర్నాలకు ప్రత్యామ్నాయంగా.. పన్నుల చెల్లింపు నిరాకరణ వంటి వాటిని ఉద్యమ సాధనాలుగా లోక్‌సత్తా భావిస్తుంది. స్థానిక ప్రభుత్వాల సాధికారతపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఇటీవల తమిళనాడులో ఈ తరహా కార్యక్రమాన్ని చేపట్టింది. అధికారాలన్నీ ముఖ్యమంత్రి చేతిలో కేంద్రీకృతమైపోయి స్థానిక ప్రభుత్వం నిర్వీర్యం కావటంతో చెన్నైలో రోడ్లు, పారిశుద్ధ్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ వంటివి అధ్వాన్నంగా తయారై నిర్ణయాలలో జాప్యం పెరిగిపోయింది. దీంతో కొన్ని నెలల క్రితం అసాధారణ వర్షానికి చెన్నైలో జనజీవితం దుర్భరంగా మారింది. సరైన పాలన లేకపోబట్టే ప్రజలకు ఈ బాధలు వచ్చాయి కాబట్టి 'మా పన్నుల డబ్బు మాకు తిరిగి ఇచ్చేయండి' అంటూ లోక్‌సత్తా పార్టీ తమిళనాడు విభాగం చేపట్టిన క్యాంపెయిన్ పోస్టర్ ఇది.**

రాష్ట్రాలకు, చివరికి కేంద్రానికి కూడా ఈ వ్యాఖ్యలు వర్తిస్తాయి. వీటిలో అవినీతికి ఏవీ దూరంగా లేవు.

పన్ను చెల్లింపుదారుల తీవ్ర వేదనను, ఆరాటాన్ని ప్రభుత్వం, అధికారులు అర్థం చేసుకోవాలని న్యాయమూర్తి చెప్పారు. కీలక స్థానాల్లో ఉన్నవారు అవినీతిని నిరోధించే లక్ష్యంతోటే పనిచేయాలి. దాన్ని పౌరుల 'నిస్సహాయ' ఆశగా మాత్రమే ఉండేలా చేయొద్దు. అధికార స్థానాల్లో ఉన్న నీతినియమాలు లేని వ్యక్తులు డబ్బును కొల్లగొడుతున్నారు. నీతులు, ధర్మాలు వెనక సీట్లోకి వెళ్లిపోయాయి. చివరికి కొల్లగొట్టే వారి కోసమే మనం పన్నులు చెల్లిస్తున్నామా? అవినీతి డబ్బులో తమ వాటా కోసం చూస్తున్నవారితో చేతులు కలుపుతూ ప్రజాజీవితంలో నీతిని వదిలివేసిన వారి నుంచే కాకుండా.. అవినీతికి, ప్రభుత్వ రాబడులకు మధ్య నెలకొంటున్న ఆసక్తికరమైన లింకును కూడా నేను చూస్తున్నాను. ఏదేమైనా అవినీతికి రెండు ముఖాలు. ఒకరేమో చేయకూడని పనులను చేస్తూ ఒక ప్రభుత్వం, దాని శాసనాల లక్ష్యాన్నే ధ్వంసం చేసేవారు కాగా, మరొకరు ప్రభుత్వానికి చెల్లించవలసిన పన్నులను ఎగ్గొట్టటానికి ముడుపులు చెల్లించేవారు.

ఇక్కడ చిన్న ఉదాహరణ. లంచం తీసుకునే కానిస్టేబుల్.. జరిమానాల ద్వారా వచ్చే బకాయిలను ప్రభుత్వానికి రానివ్వకుండా చేస్తుంటాడు. ముడుపుల కంటే జరిమానాల మొత్తం అధికంగా ఉంటుంది. లేదా ఇసుక తవ్వకం కోసం నదులను చట్టవిరుద్ధంగా తవ్వేయటానికి అనుమతించటం. ఇది ప్రభుత్వ రాబడిని మాత్రమే కాకుండా ఉమ్మడి సహజ వనరులను కూడా కొల్లగొడుతుంది. లేదా టెలికాం రంగంలో 2జీ స్పెక్ట్రంలో రావలసిన రాబడి బకాయిలను కొల్లగొట్టటం లేక నాసిరకంగా నిర్వహించే మునిసిపాలిటీ రోడ్లకు అదనపు బిల్లులను దండుకోవటం కూడా ఈ కోవకే చెందుతాయి.

అంతిమ విశ్లేషణలో ప్రభుత్వం రాబడులపరంగా కునారిల్లిపోతుండగా, కొద్దిమంది పరిమాణం మాత్రం రానురానూ పెరిగిపోతోంది. ఎందుకంటే, అవినీతి ఇప్పుడు ఒక మినహాయింపుగా కాకుండా నిత్యవ్యవహారం అయిపోయింది.

6వ పే ప్యానల్ స్కేల్ అమలులో ఉన్నప్పటికీ, పెన్షనర్ల జేబుకి ఎలా చిల్లుపెట్టాలా అనే విషయం తప్ప మరేదీ ఆలోచించని పెన్షన్ ఆఫీసులోని మురికివ్యక్తి, ఇప్పుడు 7వ పే కమిషన్ సిఫార్సుల కోసం ఆత్రుతగా ఎదురుచూస్తుంటాడు. మహారాష్ట్ర రోడ్డు రవాణా శాఖలోనే ఒక సంవత్సరంలో ప్రభుత్వానికి రావలసిన దాదాపు రూ. 900 కోట్ల ఆదాయాన్ని లంచగొండులు కొల్లగొడుతున్నారని ఒక అధికారి నాతో స్వయంగా చెప్పారు. ఈ లెక్కన ఆ రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఎంత రాబడిని కోల్పోతోందో ఊహించుకోవచ్చు.

ఇక్కడ ప్రస్తావించిన రూ. 900 కోట్లలో ఒక భాగం.. పనులు చేసిపెట్టటానికి చెల్లించవలసిన ఫీజు కింద పోతుంది. ఏదేమైనా ఇలాంటి వ్యవహారాలు మొత్తంగానే ప్రభుత్వానికి రాబడిని దూరం చేస్తున్నాయి. ప్రభుత్వ రాబడికి పడుతున్న ఇలాంటి చిల్లులు సార్వత్రికంగానే జరుగుతున్నప్పటికీ, ద్రవ్యోల్బణం, సామాజిక సంక్షేమం కోసం కొత్త అవసరాల కారణంగా ప్రభుత్వం మరిన్ని పన్నులు విధించాల్సి వస్తోంది. చివరికి నష్టపోయేది పౌరులే మరి. అంటే రాష్ట్ర బడ్జెట్‌లో ఎప్పుడు కొత్త పన్నులు విధించినప్పటికీ అవన్నీ అవినీతి సూచికలుగానే భావించాలి.

ఉప్పు మీద బ్రిటీషు ప్రభుత్వం విధించిన పన్ను చాలా ఎక్కువగా ఉన్న కారణంగానే మహాత్మాగాంధీ అప్పట్లో దండి మార్చ్ ప్రారంభించారు. అదనపు పన్నులు, అదనంగా కొల్లగొట్టటంపై ప్రభుత్వాలకు ఉన్న నైతిక హక్కే ఇప్పుడు ప్రశ్నార్థకమైంది. నేను ఆర్థికవేత్తను కానప్పటికీ, ఖర్చు పెడుతున్న ప్రతి వంద రూపాయల్లోనూ 84 రూపాయలకు చిల్లులు పడకుండా మొత్తాన్ని వెచ్చించగలిగినట్టయితే (రాజీవ్‌గాంధీ ప్రసంగాన్ని గుర్తుతెచ్చుకోండి మరి) దేశం మరింత మంచిస్థితిలో ఉండేది. పన్నులు కూడా తగ్గిపోయేవి.

జస్టిస్ చౌదరి ధర్మాగ్రహాన్ని, ఆవేదనను నేను అర్థం చేసుకోగలను. ఆయన చట్టంలోని సాంకేతిక అంశాలకు మాత్రమే కట్టుబడకుండా పౌరుల నిస్సహాయ స్థితిని అర్థం చేసుకున్నారు. ఒక మధ్య దళారి అటు లబ్ధిదారును, ఇటు పన్ను చెల్లింపుదారును ఇద్దరినీ కొల్లగొడుతున్న కారణంగా, నేను చెల్లిస్తున్న పన్నులతో కలిగే ప్రయోజనాన్ని మరొకరు ఎందుకు నష్టపోవాలి? అతితక్కువ ఖర్చుతో లబ్ధిదారులకు అందే ప్రయోజనాల బట్వాడా సామర్థ్యాన్ని నయవంచకులు క్షీణింపచేస్తున్నారు. ఇది పేలవమైన ప్రభుత్వానికి లేదా పాలనా రాహిత్యానికే సూచిక.

(సాక్షి సౌజన్యంతో) ◈

# గ్రూప్ ఫోటో కార్యక్రమంలా గవర్నర్ల సదస్సు



అరుణాచల్‌ప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించిన తీరు వివాదాస్పదమైన నేపథ్యంలో ఫిబ్రవరిలో న్యూఢిల్లీలో జరిగిన రెండురోజుల గవర్నర్ల సదస్సు నుంచి ఎంతోకొంత సంస్కరణని ఆశించినా యథాస్థితిని కొనసాగిస్తూ గ్రూప్ ఫోటో కార్యక్రమంలా ముగిసింది. కేంద్ర-రాష్ట్రాల సంబంధాలు, అంతర్గత భద్రత, భారత్‌లో తయారీ, స్టార్టప్, డిజిటల్ ఇండియా, స్వచ్ఛ భారత్, ఈశాన్య రాష్ట్రాల్లో ఉపాధి అవకాశాల కల్పన, అభివృద్ధి తదితర అంశాలు ఎజెండాలో ఉన్నప్పటికీ గవర్నర్ల పాత్ర, నియామకం, బదిలీ, తొలగింపు నుంచి అసలు గవర్నర్ల వ్యవస్థ ఉండాలా అనే అంశాలపై సదస్సులో చర్చ జరగాలని, కొన్నయినా మార్పులు మొదలవ్వాలని చాలామంది కోరుకున్నారు. స్వతంత్ర భారతావనిలో గవర్నర్ పదవిపై జరిగినంత చర్చ మరే పదవిపైనా జరగలేదంటే అతిశయోక్తి కాదు. దాదాపు మూడు దశాబ్దాలలో ఎన్నడూ లేనంతస్థాయి ఆశల మధ్య 2014లో ప్రధాని బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీ, ఆ వెంటనే గత యూపీయే పాలకుల తీరులోనే కొంతమంది గవర్నర్ల రాజీనామాను కోరటం చాలామందిని నిరాశపరిచింది. గవర్నర్లను కేంద్రప్రభుత్వం రాజకీయావసరాలకు వినియోగించుకోవటం తగదని ఆరోజు స్పష్టమైన ఆదేశాన్ని ఉన్నత న్యాయస్థానం ఇవ్వకపోవటంతో ఈరోజు అరుణాచల్‌ప్రదేశ్ దాకా పరిస్థితి వచ్చింది. దేశం కన్నా, రాజ్యాంగం కన్నా పార్టీ మిన్న అనే పాత రాజకీయ సంస్కృతి కొనసాగింపులో భాగంగానే అరుణాచల్ గవర్నర్ రాజ్ ఖోవా వివాదాస్పదంగా వ్యవహరించారనటంలో ఎటువంటి సందేహమూ లేదు. ఈ నేపథ్యంలో గవర్నర్ల వ్యవస్థలో పదవీ, పార్టీ రాజకీయాలకు అతీతంగా కొన్నయినా నిర్దిష్ట మార్పులను గవర్నర్ల సదస్సు ప్రతిపాదించి ప్రయత్నం చేస్తుందని ఆశించిన వారికి భంగపాటే ఎదురైంది. మార్పుల్ని అమలుచేయాల్సిన వారు ప్రతిపాదనలు కూడా చేయకుండా కేవలం సూక్తుల వల్లింపులతో సరిపెట్టారు. పెట్టుబడులు వస్తే చాలు, పాలనా, రాజకీయ సంస్కరణలు, విద్య, ఆరోగ్యం, వికేంద్రీకరణ వంటి విధానాలేవీ లేకుండానే భారత్ దూసుకుపోతుందన్న మోదీ ప్రభుత్వ భ్రమకు ఈ సదస్సు మరో నిదర్శనంగా నిలిచింది. రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారంతా రాజ్యాంగ పవిత్రతను కాపాడాలని సదస్సుని ప్రారంభించిన రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ పిలుపునిచ్చారు. నిజాయతీగా ఉండటమేకాదు నిజాయతీగా ఉన్నట్టు కూడా గవర్నర్లు కనిపించాలని హితవు పలికారు. గవర్నర్లు రాష్ట్రాల్లో 'ఉత్ప్రేరక ప్రతినిధులు' అని నరేంద్ర మోదీ సదస్సు ముగింపు సమావేశంలో అన్నారు. నేరుగా భాగం పంచుకోకుండా ప్రక్రియలు వేగవంతమయ్యేందుకు, మెరుగుపడేందుకు దోహదం చేయాలన్నారు. సహకార సమాఖ్య స్ఫూర్తి.. పోటీతో కూడిన సమాఖ్య తత్వంగా రూపుదిద్దుకోవాలన్నారు. తమ పదవీకాలం ముగిసేనాటికి గవర్నర్లు ఆయా రాష్ట్రాల్లో తమదైన ముద్ర వేయాలన్నారు. ◈

## వీరజవానులకు లోక్‌సత్తా వందనం



దేశం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా వదులుకున్న వీరజవానులను దేశ ప్రజలు తమ గుండెల్లో దాచుకుంటారని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ, జీహెచ్‌ఎంసీ అధ్యక్షుడు దోసపాటి రాము అన్నారు. సియాచిన్ మంచులో దేశం కోసం పోరాడుతూ అమరులైన జవానులకు విజయనగరంలో, హైదరాబాద్‌లో నివాళులర్పిస్తూ పార్టీ నేతలు శాంతి జ్యోతిని వెలిగించారు. లాన్స్‌నాయక్ హనుమంతప్పలాంటి వీరుల త్యాగాలను పరిరక్షించే వ్యవస్థను సమాజం నిర్మించుకోవాలని, మనం ఓ పక్క దేశాన్ని నాశనం చేసే పాత, అవినీతి రాజకీయాన్ని కొనసాగిస్తూ మరోపక్క కంటితుడుపు నివాళులర్పించటం వల్ల ఉపయోగం ఉండదని నేతలన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకుడు పోలుపర్తి అప్పారావు, చైతన్య యువసంఘం సభ్యులు రమేష్, వీరాస్వామి, శ్రావణి, స్వాతి, రాజు, సతీష్, అంజయ్య, వెంకటేష్, జగదీష్, రవిచంద్ర, నర్సింహ తదితరులు పాల్గొన్నారు. ◈

# కేంద్రం తాబేదార్లుగా వ్యవహరిస్తున్న గవర్నర్లు

- డా॥ జయప్రకాష్ నారాయణ్



భారతదేశంలో ఇటీవల రాజకీయంలో గవర్నర్ల పాత్ర చర్చనీయాంశమయింది. చాలాకాలం నుంచి ఎందరో గవర్నర్లు రాజకీయంలో తలదూర్చి భారత ప్రజాస్వామ్యానికి తీరని చేటు చేశారు. కొన్ని సందర్భాలలో వాళ్లు కూడా అభాసుపాలయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో 1984లో రామ్‌లాల్ నిర్వాకం గురించి అందరికీ తెలుసు. అలాగే అంతకంటే ముందు హర్యానాలో తపాసే అనే గవర్నరు, ఇటీవల ఉత్తర ప్రదేశ్‌లో భండారీ- వీళ్లంతా ప్రజలకు రోతపుట్టేలాగా నీచంగా ప్రవర్తించారు. అసలీ గవర్నర్ల పాత్రను కొంత వివరంగా చర్చిద్దాం.

**రాచరిక సంప్రదాయమిది**

భారతదేశ చరిత్రలో వేల సంవత్సరాల క్రితం నుంచి చక్రవర్తి తన అనుయాయుల్ని, లేదా రాచకుటుంబంలోని వాళ్లను తన సామ్రాజ్యంలోని వివిధ రాజ్యాలకు గవర్నర్లుగా పంపే ఆనవాయితీ ఉంది. ఉదాహరణకు అశోకుడు 'గవర్నర్'గా పనిచేశాడు. ఇంత పెద్ద దేశంలో, అందునా ఆ కాలంలో దేశ రాజధాని నుంచి పాలనను సమర్థంగా నిర్వహించటం సాధ్యం కాదు కాబట్టి రాజప్రతినిధులు వివిధ రాజ్యాలకు, లేదా ప్రాంతాలకు వెళ్లి పరిపాలించటం అవసరమయింది. చోళుల కాలంలో వివిధ రాజ్యాలను మండలాలని, వాటిని పాలించే రాజప్రతినిధులను మండలాధీశులని పిలిచేవారు. అలాగే ఢిల్లీ సుల్తానుల కాలంలో కూడా సుల్తాను ప్రతినిధులు వివిధ ప్రాంతాలలో రాజ్యం చేసేవాళ్లు. ఆ సుల్తాను బలహీనుడయితే అడపాదడపా గవర్నర్లు స్వతంత్రం ప్రకటించుకునేవాళ్లు లేదా సుల్తాను మీదే దండెత్తి అతడిని వధించి పదవిలో కూర్చునే ప్రయత్నం చేసేవాళ్లు. ఉదాహరణకు ఢిల్లీ సింహాసనాన్ని అధిష్టించిన ఏకైక మహిళ రజియా సుల్తానాపై తిరుగుబాటులో అప్పటి సర్హింద్ గవర్నర్ అల్తూనియా ప్రముఖ పాత్ర వహించాడు. అయితే, రజియా అతణ్ణే పెళ్లాడి సింహాసనాన్ని కాపాడుకునే ప్రయత్నం చేసింది. కానీ ఆ ఇద్దర్నీ చంపి రజియా సోదరుడు ముజ్జుద్దీన్ బహరామ్ సుల్తానయ్యాడు. కొందరు అదను చూసుకుని శత్రు రాజులతో కలిసి కేంద్ర ప్రభుత్వం మీద దాడి చేసేవాళ్లు. ఉదాహరణకు ఢిల్లీ సుల్తానుల్లో ఆఖరివాడైన ఇబ్రహీం లోఢి.. బాబరు చేతుల్లో ఓడిపోవటానికి ప్రధాన కారణం అప్పటి పంజాబు గవర్నర్ దౌలత్‌ఖాన్ లోఢి బాబరుతో చేతులు కలపటం. మొగల్ చక్రవర్తుల కాలంలో ఈ రాజ్యాలను 'సుబాలు' అని పిలిచేవారు. ఈ సుబాల గవర్నర్లను సుబేదారులుగా వ్యవహరించేవారు. అక్బరు కాలంలో 15 సుబాలుండేవి. స్థానికంగా ఎవరైనా సామ్రాజ్యానికి ఇబ్బంది కలిగిస్తే వెంటనే సుబేదారును పంపి తిరుగుబాటును అణచివేసేవాళ్లు. ఉదాహరణకు శివాజీ గెరిల్లా యుద్ధాల ద్వారా మొగల్ సామ్రాజ్యాన్ని చికాకు పెట్టాడు. వెంటనే శాయిస్తాఖాన్ అనే దక్కను సుబేదారును పంపి అతణ్ణి లంగదీయవలసిందిగా ఔరంగజేబు ఆజ్ఞాపించాడు. అయితే శివాజీ అర్ధరాత్రి అతడిపై దాడిచేసి పారద్రోలాడు. ఆ తరువాత శివాజీ సూరత్ సుబేదారు ఇనాయత్‌ఖాన్‌ను ఓడించి సూరత్‌ను దోచుకున్నాడు. చివరికి మొగల్ సేనాపతి రాజా జైసింగ్ శివాజీని ఓడించి బందీగా చక్రవర్తి దగ్గరకు తీసుకెళ్లాడు. ఆ తరువాత శివాజీ జైల్లో నుంచి చాకచక్యంగా తప్పించుకోవటం, ఛత్రపతిగా ప్రకటించుకోవటం వేరే కథ. బ్రిటీషువారి కాలంలో ఈస్ట్ ఇండియా కంపెనీవారి గవర్నర్ జనరల్ కలకత్తాలో ఉండేవాడు. మద్రాసు, బొంబాయిలలో వారి ప్రోవిన్సులు ఉండేవి. వాటికి గవర్నర్లను నియమించి పాలన బాధ్యతను వాళ్ల చేతుల్లో పెట్టారు. వారిలో చాలామంది మంచి పేరు తెచ్చుకున్నారు. ఉదాహరణకు మద్రాసు ప్రోవిన్సులో థామస్ రో తన రైతువారీ సెటిల్మెంటు విధానాల ద్వారా ప్రజల మన్నన పొందాడు. 1857 తరువాత ప్రత్యక్షంగా బ్రిటీషు ప్రభుత్వం భారతదేశ పాలన బాధ్యతను స్వీకరించింది. వైస్రాయిని బ్రిటీషు ప్రభుత్వం నియమించగా, ప్రోవిన్సుల కోసం గవర్నర్ల వ్యవస్థ యధాతథంగా కొనసాగింది. 1911లో దేశ రాజధానిని

కలకత్తా నుంచి ఢిల్లీకి తరలించారు. బెంగాల్, బొంబాయి, మద్రాసు ప్రోవిన్సులకు గవర్నర్లు కొనసాగారు. ఇలా భారతదేశంలో గవర్నర్ల వ్యవస్థకు బోలెడంత చరిత్ర ఉంది. సామ్రాజ్యంలో నుంచి ఏ ప్రాంతమూ జారిపోకుండా ఉండటం కోసం దేశ రాజధాని నుంచి గవర్నర్లను పంపి వారి ఆధిపత్యంలో పాలనను కొనసాగించే సంప్రదాయం రాచరికంలోను, మధ్యయుగాలలోను, వలస కాలంలోను స్థిరపడింది. అందుకే గవర్నరును ఎప్పుడూ కేంద్ర ప్రభుత్వమే నియమించటం, ఆయన కేంద్రానికి ప్రతినిధిగా ఉండటం జరిగేది. స్వతంత్ర భారతంలో ప్రజాస్వామ్యాన్ని పాలన పద్ధతిగా ఎంచుకున్నాం. స్వపరిపాలన వ్యవస్థలో ప్రజలే ప్రభువులు. అధికారంలో ఎవరుండాలో, వాళ్లు ఏమి చేయాలో నిర్ణయించాల్సింది ప్రజలు. ప్రజాస్వామ్యంలో పాలకులు సేవకులు మాత్రమే. అందునా ఎన్నో భాషలు, ప్రాంతాలు, మతాలు, కులాలు, మరెన్నో వైవిధ్యాలు ఉన్న భారతదేశంలో రాజ్యాంగరీత్యా జాతీయస్థాయిలో ఒక ప్రభుత్వం ఉండగా, రాష్ట్రాలలో వేరే ప్రభుత్వాలు ఉంటాయి. రాజ్యాంగంలోని 246వ అధికరణం ప్రకారం 7వ షెడ్యూల్‌లో జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో చట్టసభల అధికారాలను స్పష్టంగా నిర్వచించారు. అలాంటప్పుడు కేంద్ర ప్రభుత్వం తన ప్రతినిధులను రాష్ట్రాలకు గవర్నర్లుగా పంపటం, ఆ గవర్నర్లు రాష్ట్రాల అధిపతులుగా ఉండటం, అవకాశం వచ్చినప్పుడల్లా రాజకీయాలలో వేళ్లు పెట్టి గందరగోళం సృష్టించటం, అందునా రాష్ట్రంలో అధికార పార్టీ కేంద్రంలో ప్రతిపక్షమయినప్పుడు అర్ధరాత్రి మంతనాలతోను కుట్రలతోను ప్రభుత్వాలను మార్చే ప్రయత్నం చేయటం– ఇవన్నీ పూర్తిగా ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలు. రాష్ట్ర ప్రభుత్వం ఎంత పెద్ద మద్దతుతో అధికారాన్ని చేపట్టినా గవర్నరు ఎప్పుడు ఏ ఇబ్బంది కలిగిస్తాడో అన్న ఆందోళనకు గురికాక తప్పదు. రాజ్యాంగరీత్యా రాష్ట్రానికి అధిపతి గవర్నరు. అన్ని నిర్ణయాలు ఆయన పేరుతో జరుగుతాయి. అన్ని చట్టాలు ఆయన ఆమోదముద్రతో మాత్రమే అమలవుతాయి. ముఖ్యమంత్రిని, మంత్రివర్గాన్ని నియమించాల్సింది గవర్నరు. 356 అధికరణం కింద రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయవలసిందని, రాష్ట్రపతి పాలన పేరుతో తన పాలనను విధించాలని సిఫారుసు చేసేది గవర్నరు. రాష్ట్ర శాసనసభను రద్దు చేసి మధ్యంతర ఎన్నికలకు ఆదేశించేది గవర్నరు. అందువల్ల కేబినెట్ పరిపాలనలో చూడటానికి గవర్నరు పాత్ర నామమాత్రమే అయినప్పటికీ, వాస్తవానికి దానిలో చాలా రాజకీయం ఇమిడి వుంది. ప్రసూతి వైద్యాన్ని గురించి ఒక నానుడి ఉంది. బిడ్డ పుట్టుక చాలావరకు ప్రకృతి చూసుకుంటుంది. అందువల్ల మంచి ప్రసూతి వైద్యుడి పాత్ర 'జాగరూకతతో గర్భిణీ స్త్రీని కనిపెట్టుకుని ఉండటం, ఏమీ అనవసర జోక్యం చేసుకోకుండా ప్రకృతి ముందు తలవంచటం మాత్రమే'నని మాకు వైద్యంలో చెప్పేవారు. ఒకరకంగా గవర్నరు పాత్ర కూడా కేబినెట్ పరిపాలనలో అలాగే ఉండాలి. కానీ 356వ అధికరణం దుర్వినియోగాన్ని పరిశీలిస్తే గవర్నర్లు రాజకీయ మాయాజూదంలో పాచికలుగా ఎలా ఉపయోగపడ్డారో తెలుస్తుంది. గత 48 సంవత్సరాలలో ఇప్పటికి నూరుసార్లుపైగా రాష్ట్ర ప్రభుత్వాలను రద్దుచేసి రాష్ట్రపతి పాలన పేరుతో గవర్నరు ద్వారా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ పాలన ప్రవేశపెట్టారు. అందులో అత్యధిక పర్యాయాలు కేంద్రంలో ప్రతిపక్షంలో ఉన్న పార్టీలకు చెందిన రాష్ట్ర ప్రభుత్వాలే వేటుకు గురయ్యాయి. ఈ ఒక్క అంశం చాలు గవర్నర్లను 'శిఖండులు'గా ఎలా ఉపయోగించుకుంటున్నారో తెలపటానికి. 1980ల ప్రారంభంలో తపాసే హర్యానాలో గవర్నరుగా ఉన్నాడు. అప్పుడు భజన్‌లాల్ ముఖ్యమంత్రి. అదివరకు జనతాపార్టీ తరపున ఎన్నికై, ఆ పార్టీ ముఖ్యమంత్రిగా ఉన్న భజన్‌లాల్ ఏకంగా తన రాష్ట్రంలో ఉన్న జనతా శాసనసభ్యులందరితో కలిసి పార్టీ ఫిరాయించి ఇందిరా కాంగ్రెస్‌లో చేరి తన పదవిని కాపాడుకున్నాడు. ఆ తరువాత 1982లో వచ్చిన శాసనసభ ఎన్నికల సందర్భంలో ఆయనొక సంచలన ప్రకటన చేశాడు– "ఎన్నికలలో, ఏ పార్టీ గెలిచినా నేను గనక నా సీటును గెలిచి శాసనసభ్యుడినయితే మళ్లీ ముఖ్యమంత్రిని నేనే" అని ఆయన ప్రకటించుకున్నాడు. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయి దేవీలాల్ నాయకత్వంలోని జనతాపార్టీ ఎక్కువ సీట్లు సంపాదించింది. కానీ గవర్నర్ తపాసే మళ్లీ భజన్‌లాల్‌నే ముఖ్యమంత్రిగా నియమించాడు. కొద్దిగంటలలోనే భజన్‌లాల్ ఫిరాయింపులను ప్రోత్సహించి మెజారిటీ మద్దతును సంపాదించాడు. ఆ విధంగా ఆ గవర్నర్ పుణ్యమా అని ఎన్నికలలో ప్రజలిచ్చిన తీర్పునకు, ఏర్పడిన ప్రభుత్వానికి ఏమీ సంబంధం లేకుండా పోయి ప్రజాస్వామ్యం తీవ్రంగా భంగపడింది.

### 'భండారీలు' ప్రజాస్వామ్యానికే కళంకం

1984లో రామ్‌లాల్ మెజారిటీ మద్దతు, ప్రజాభిమానం ఉన్న ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదించిన వైనం, ఆపైన బ్రహ్మాండమైన ప్రజాఉద్యమం, మళ్లీ ఎన్టీఆర్‌ను ముఖ్యమంత్రిగా నియమించటం, ఆ తరువాత ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన పార్లమెంటు ఎన్నికలలో సానుభూతి పవనాలు ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించకపోవటం, తెలుగుదేశం పార్టీ ఆ ఎన్నికలలో గెలవటం అందరికీ గుర్తే. ప్రజలు అప్రమత్తంగా లేకపోతే ఆనాటి దారుణాన్ని నిలువరించటం సాధ్యమయ్యేది

కాదు. కేంద్రంలో పాలకపక్షం మాట విని కాశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టటం లేదని 1984లో గవర్నరు బి.కె నెహ్రూను బదిలీ చేసి ఆ స్థానంలో జగ్‌మోహన్‌ని నియమించారు. ఆయన మెజారిటీ ప్రభుత్వాన్ని కూలదోసి, ఫిరాయింపుల్ని ప్రోత్సహించి– ఫరూక్ అబ్దుల్లా బావమరిది జి.ఎం.షా నాయకత్వంలో (పార్టీ ఫిరాయించిన వారంతా మంత్రులుగా) కొత్త ప్రభుత్వాన్ని ప్రమాణ స్వీకారం చేయించాడు. కాంగ్రెస్ పార్టీ బైటి నుంచి మద్దతిచ్చింది. ఆనాడు కాశ్మీర్‌లో అంటుకున్న రావణకాష్టం నేటికీ చల్లారకుండా మండుతూనే ఉన్నది. జాతి తీవ్రంగా నష్టపోయింది. 1991లో చంద్రశేఖర్ ప్రభుత్వం రాజీవ్‌గాంధీ ఒత్తిడితో తమిళనాడులో కరుణానిధి ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలని నిర్ణయించుకుంది. కానీ అప్పటి గవర్నరు, నేటి కేంద్ర మంత్రి సుర్జీత్‌సింగ్ బర్నాలా అందుకు అంగీకరించలేదు. ఆయనను అడ్డుతొలగించాలని బదిలీ చేస్తే అందుకు నిరసనగా ఆయన రాజీనామా చేశారు. వెంటనే తమకు కావలసిన భీష్మనారాయణ్ సింగ్‌ను గవర్నర్‌గా నియమించి ఆయనతో ఒక నివేదిక తెప్పించుకుని డీఎంకే ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించారు. ఇక ఇటీవల భండారీ మరో నాలుగడుగులు ముందుకు వేశారు. ఎన్నికలయ్యాక అసలు ప్రభుత్వమే ఏర్పడకుండా నిరోధించిన దిట్ట ఆయన. ఆ తరువాత ప్రభుత్వం ఏర్పడినా మెజారిటీ ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించే ప్రయత్నం చేసిన ఘనుడు భండారీ! ఆ తర్వాత రాత్రికిరాత్రి ఉన్న మంత్రివర్గాన్ని తొలగించి అకస్మాత్తుగా కొత్త ముఖ్యమంత్రిని, ఇతరులను ప్రమాణస్వీకారం చేయించిన ఘనాపాఠి ఆయన. అంత దారుణాలు చేసి కూడా ఇంకా నిర్లజ్జగా రాజ్యాంగాన్ని వల్లిస్తూ కేంద్రంలో ప్రభుత్వం తొలగిస్తుందని నిర్ధారణ అయ్యేంతవరకు పదవిని అంటిపెట్టుకుని వేళ్లాడిన ఘనత ఆయనకే దక్కింది. ఇలా ఎందరో గవర్నర్లు కేంద్రంలో తాత్కాలికంగా అధికారంలో ఉన్న పార్టీకి, ప్రభుత్వానికి తాబేదార్లుగా పనిచేయటంలో సిద్ధహస్తులయ్యారు. ప్రజాస్వామ్యాన్ని, ఫెడరల్ స్ఫూర్తిని, రాష్ట్రాల హక్కులను, రాజ్యాంగ పవిత్రతను కళంకితం చేశారు.

ఈ గవర్నర్ల వ్యవస్థను సమూలంగా మార్పు చేయవలసి ఉంది. ప్రజలే ప్రభుత్వాధినేతను నేరుగా ఎన్నుకుంటే, ఆ ఎన్నికైనవారు ఆయా రాష్ట్రాల్లో రాజ్యాంగాధినేతలుగానూ వ్యవహరించాలి. ఈ పద్ధతిలో రాజకీయ అస్థిరతకు, అనిశ్చిత స్థితికీ ఆస్కారం ఉండదు. పైగా నిజాయతీతో కూడిన, సుపరిపాలనను అందించే ప్రభుత్వం ఏర్పడుతుంది. లేదంటే, గవర్నర్‌ని పరోక్ష పద్ధతిలో ఎన్నుకోవాలి. రాష్ట్రపతిని ఎన్నుకున్నట్టే, రాష్ట్రాల్లోని చట్టసభలు గవర్నర్‌ని ఎన్నుకోవచ్చు. అలాగే, సదరు గవర్నర్‌ను తొలగించే అధికారమూ చట్టసభకే ఉండాలి. ఇలా గవర్నర్ల నియామకంలో కేంద్రప్రభుత్వ ప్రమేయానికి అడ్డుకట్ట వేయవచ్చు. ప్రస్తుత గవర్నర్ల వ్యవస్థ ఆరో వేలు మాదిరిగా నిరర్థకంగా, నిష్ప్రయోజనకరంగా తయారైంది. కేంద్రం నామినేషన్లతో కాకుండా ప్రజలుగానీ, శాసనసభగానీ రాజ్యాధినేతను ఎన్నుకునే ఏర్పాటు చేసినప్పుడుగానీ భారతదేశంలో అధికార వికేంద్రీకరణ, రాష్ట్రాల హక్కుల పరిరక్షణ సాధ్యం కావు.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా ఏప్రిల్ 13, 1998న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం) ◈

## రైవాడ నీరు ముందు రైతులకే ఇవ్వాలి



వ్యవసాయ అవసరాల కోసం నిర్మించిన రైవాడ జలాశయం నీటిని రైతులకే ఇవ్వాలని రైవాడ జలాశయ నీటిసాధన కమిటీ డిమాండ్ చేసింది. రైవాడ వద్ద జలాశయం నిర్మించినప్పుడు 15344 ఎకరాలకు అదనంగా 6వేల ఎకరాలకఅదనపు ఆయకట్టుకు నీరిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు అసలు ఆయకట్లుకే ఎసరు పెడుతున్నారని కమిటీ ఛైర్మన్ వేచలపు వెంకట చినరాము నాయుడు అన్నారు. ఏలేరు కాలువ వచ్చే వరకు రైవాడ నీటిని విశాఖ ఉక్కుఫ్యాక్టరీకి ఇస్తామన్నారని, ఇప్పుడు నిర్మాణం పూర్తయినా ఆయకట్టుకి నీళ్లివ్వటం లేదన్నారు. రైవాడ జలాశయం మరమ్మతులకు జీవీఎంసీ బాకీపడ్డ రూ.110 కోట్లు వెంటనే విడుదల చేయాలని లోక్‌సత్తా పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. రైవాడ నీటిని రైతులకు అందించేందుకు ఐదురోజుల 'రైవాడ నీరు రైతు గర్జన' పాదయాత్ర అనంతరం విశాఖ జిల్లా ఆనందపురంలో జరిగిన సభలో వీరు మాట్లాడారు. కె.కోటపాడు, దేవరాపల్లి, వేపాడ మండలాల నుంచి భారీసంఖ్యలో రైతులు సభకు హాజరయ్యారు. రైతు నేతలు వై.సీతారాం, జి.నాయినిబాబు, రొంగలి ముత్యాల నాయుడు, జి.చింతాలు, ఈర్లె నాయుడుబాబు, యర్రా దేముడు, వేచలపు వెంకటరమణ (కాసుబాబు), లెక్కల శ్రీనివాసరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ◈

# రూ. లక్ష కోట్ల రెండు ప్రాజెక్టులు - అనేక ప్రశ్నలు




సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలాగే తెలంగాణ సర్కారు కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. భూసేకరణ, గుత్తేదారు ప్యాకేజీల ధరలు అమాంతం పెంపు వంటి వాటిపై ఆరోపణలకు తోడు ఏకంగా రూ.1లక్షా 10వేల కోట్లతో కేవలం రెండు భారీ ఎత్తిపోతల ప్రాజెక్టులను కేసీఆర్ ప్రభుత్వం చేపట్టటం కొన్ని కీలక ప్రశ్నలను లేవనెత్తుతోంది.

తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు అందించాలని, సాగునీటి ప్రాజెక్టులకు 2016-17 బడ్జెట్‌లో రూ.25,000 కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో తుది దశలో ఉన్న ప్రాజెక్టులకు ప్రాధాన్యమిచ్చి పూర్తి చేయాలన్న ఆలోచన ఆచరణాత్మకమైనది, స్వాగతించదగ్గది. వచ్చే ఖరీఫ్ నుంచే ఆ ప్రాజెక్టుల ఆయకట్టుకు నీరివ్వాలని భావించటం సంతోషకరం. అయితే వివిధ కొత్త ప్రాజెక్టుల విషయంలో, ముఖ్యంగా ప్రాణహిత-చేవెళ్ల రీడిజైన్‌గా రూపొందించిన రూ.75,667 కోట్లతో ప్రతిపాదించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, రూ.35,000 కోట్లతో ప్రతిపాదించిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టువిషయంలో సహేతుకమైన అభ్యంతరాలున్నాయి. నికర నీటి లభ్యత అంశాన్ని పక్కనపెట్టినా కూడా.. ఈ రెండు ప్రాజెక్టులకయ్యే ప్రతిపాదిత ఖర్చే లక్షకోట్లు దాటుతోంది. ఈ వ్యయం ఇంకెంతకు చేరుతుందో, ఇవి పూర్తవటానికి ఎన్నేళ్లు పడుతుందో ఎవరూ ఖచ్చితంగా చెప్పలేరు. ఈ నేపథ్యంలో అనేక ప్రశ్నలు.

తెలంగాణలో వ్యవసాయం మీద ఆధారపడినవారికి వారికి వస్తున్న ఆదాయమెంత? కోటి ఎకరాలకు నీరందించటం వల్ల ఎంతమందికి ఎంత ఆదాయం పెరుగుతుంది? వ్యవసాయరంగంలో ప్రభుత్వ సంస్కరణలేమిటి? ఆ సంస్కరణల తర్వాత ఎంత ఆదాయం వస్తుంది? తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన కేజీ నుంచి పీజీ ఉచిత విద్య తర్వాత ఎంతమంది వ్యవసాయం చేస్తారు? ఇంత భారీ ప్రాజెక్టులు ఆహారధాన్యాల ఉత్పత్తి కోసమా, ఉపాధిని, ఆదాయాన్ని పెంచటం కోసమా? ఉపాధిని, ఆదాయాన్ని పెంచటమే లక్ష్యమైతే ఇంతకంటే మెరుగైన, హేతుబద్ధమైన ప్రత్యామ్నాయాలు లేవా? ఒకవేళ రైతుబిడ్డలు వ్యవసాయం చేయకపోతే ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినట్టు కార్పొరేట్ కంపెనీలు కాంట్రాక్టు వ్యవసాయం చేస్తాయా? వారి సువిశాల వ్యవసాయ క్షేత్రాలలో, వ్యవసాయాధారిత పరిశ్రమలలో రైతులు కార్మికులుగా స్థిరపడతారా? పొట్టచేత పట్టుకుని వలసలు పోతారా? (తెలంగాణ వచ్చాక ఉపాధికి ఎవరూ దుబాయ్ వలస పోవాల్సిన అవసరం లేకుండా చేస్తామని ఆకర్షణీయ పడికట్టు నినాదాలతో ప్రచారం చేసిన పార్టీయే ఇప్పుడు ప్రభుత్వంలోకి వచ్చాక గల్ఫ్‌లో ఉపాధికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఉద్యోగాలకు ఎక్కడకైనా వెళ్లటం తప్పు కాదు. కానీ పాలకుల అవగాహన, స్థానికంగా మెరుగైన ఉపాధిని సృష్టించే ప్రభుత్వ సామర్థ్యంపై సందేహాలు పెరుగుతున్నాయి) ఇప్పుడు సాగునీటి రంగం మీద పెట్టిన పెట్టుబడులన్నీ చివరికి అలా భారీ పారిశ్రామికవేత్తలకు వరంగా మారతాయా? లేదా కేసీఆర్ స్వయంగా ప్రకటించినట్టు ఆయన ఫామ్ హౌస్‌లోలా రైతులకు ఆదాయం వచ్చి వ్యవసాయం లాభసాటిగా మారి రైతులకు తాము ఉంటున్న చోటే మంచి జీవితం లభిస్తుందా?... ఈ ప్రశ్నలకు సమాధానం లేకుండా అన్ని వేల కోట్లను సాగునీటి ప్రాజెక్టుల మీద వెచ్చించటం ప్రజాస్వామిక ప్రభుత్వం చేయాల్సిన పనికాదు. ధాన్యం రైతులపై దేశంలోనే అత్యధికంగా సెస్సు వసూలు చేస్తూ, మార్కెట్‌యార్డుల్ని రాజకీయ కబ్జాలో కొనసాగిస్తూ, రిటైల్ మార్కెట్‌లోకి ఎఫ్‌డీఐలను రప్పించి మౌలిక వసతులను పెంచకుండా రైతులకు కాస్త ఆదాయం పెరిగే అవకాశాల్ని కూడా ప్రత్యక్షంగా దెబ్బతీస్తున్న ప్రభుత్వ వ్యవసాయ దార్శనికతను ఎంతమాత్రం నమ్మలేం. రైతుకి బ్యాంకుల ద్వారా అప్పులు కూడా అందించలేకపోతున్న సర్కారు ఇది.

ఇప్పుడున్న లెక్కల ప్రకారం వ్యవసాయం మీద వచ్చే ఆదాయానికి ప్రాజెక్టుల మీద వెచ్చిస్తున్న డబ్బుకు ఏమాత్రం పొంతన కుదరటం లేదు. ఉదాహరణకు, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద.. ఎకరా ఆయకట్టుకు నీటిని సరఫరా చేయటానికి అవసరమైన విద్యుత్తుకు యూనిట్‌కు రూ.5.70 చొప్పున ఏటా రూ.22,193 ఖర్చవుతుందని నీటిపారుదల శాఖే లెక్కగట్టింది. శ్రీశైలం నుంచి రోజూ రెండు టీఎంసీల నీటిని మళ్లించి ఈ పథకం కింద పది లక్షల ఎకరాల ఆయకట్టుతోపాటు దిండి ఎత్తిపోతల పథకం ద్వారా 3.8లక్షల ఎకరాలకీ నీటిసరఫరా చేస్తారు. పాలమూరు-రంగారెడ్డి పరిధిలోని నార్లాపూర్, ఏదుల జలాశయాల్లో మొత్తం 4,705 మెగావాట్ల సామర్థ్యం గల

మోటార్లను వినియోగిస్తామని చెబుతున్నారు. విద్యుత్తు తయారీ కాలుష్యం పట్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యమాలు చెలరేగినప్పుడు వాటికి వ్యతిరేకంగా మాట్లాడినవాళ్లు ఇప్పుడు తెలంగాణలో అదేతరహాలో విద్యుత్తును ఉత్పత్తిచేయాలి. ప్రత్యామ్నాయ ఇంధనం, ఆధునిక పరిజ్ఞానంతో కాలుష్య నియంత్రణ వంటి సమాధానాలతో ఆ సమస్యను నిద్రపుచ్చినా, ఎకరా విద్యుత్తుకే రూ. 22,193 ఖర్చయితే మిగిలిన ఎత్తిపోతల నిర్వహణ వ్యయం, విత్తనాలు,ఎరువులు, పురుగు మందులు, కార్మికులు వంటి ఖర్చును కలుపు కుంటే ఎంతవుతుంది? ఎకరాకు వచ్చే ఆదాయం కంటే ఖర్చు పెరిగిపోతే ఆ ప్రాజెక్టులు ప్రజలకు మేలు చేస్తాయా, కీడు చేస్తాయా? చివరకు రాష్ట్రానికి గుది బండలవుతాయా?




తాగునీటికోసమంటే ఎంతైనా ఖర్చు చేయకతప్పదు. కానీ ప్రజలకు ఉపాధినిచ్చేందుకే సాగునీటి రంగం మీద ఇన్ని వేలకోట్లను ఖర్చు చేస్తున్నప్పుడు, అదే డబ్బు ద్వారా అంతకంటే ఎక్కువ ఆదాయాన్నిచ్చే మార్గాలేవీ లేవా?

2007లో అప్పటి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పేరుతో రూ. 38,500 కోట్ల రూపాయలతో అసంబద్ధమైన ఎత్తిపోతల పథకాన్ని చేపట్టినప్పుడు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నిర్ద్వంద్వంగా ఖండించారు. దీనివల్ల తెలంగాణ ప్రాంత ప్రయోజనాలు ఎంత దెబ్బతింటాయో వివరిస్తూ అదే డబ్బుతో ప్రత్యామ్నాయాలను సూచించారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చిన వేలకోట్ల నిధుల్ని కూడా ఇలా మెట్టప్రాంతాలలో సాగునీటి వనరుల్ని, ఉత్పాదకతను పెంచటానికి వినియోగించాలని చెప్పారు. ప్రాణహిత-చేవెళ్లను వ్యతిరేకించటమంటే ప్రత్యేక తెలంగాణను వ్యతిరేకించటమనే సెంటిమెంట్‌ను పెంచి పోషించిన తరుణంలో కూడా జేపీ అసెంబ్లీలోనూ, బైటా చాలా స్పష్టంగా ఆ ప్రాజెక్టును వ్యతిరేకించారు. తట్ట మన్ను తీయకుండా, ఒక్క ఇటుక పేర్చకుండా ఆ ప్రాజెక్టుకు అప్పటి ఆర్థికమంత్రి కె.రోశయ్య రూ. 1000కోట్లు మొబిలిజేషన్ అడ్వాన్స్‌ని ఇవ్వటాన్ని తప్పుపట్టారు. లోక్‌సత్తా చెప్పిన మాటలతో అప్పుడు అంగీకరించి, సూర్యాపేట సభలో కూడా ప్రాణహిత-చేవెళ్ల దిక్కుమాలిన పథకమని అభివర్ణించిన కేసీఆర్.. ఇప్పుడు అదేరీతిలో ఎత్తిపోతల పథకాలను తీసుకురావటం వెనక మారిన పరిస్థితులేమిటి?

ఎన్ని లోపాలున్నా.. చెరువుల్ని బాగుచేయటానికి, భూగర్భ జలాలను పెంచటానికి రూపొందించిన మిషన్ కాకతీయ మంచి కార్యక్రమం. ఆ పథకాన్ని వినియోగించుకుంటూ, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి వంటి భారీ ఎత్తిపోతల ప్రాజెక్టుల స్థానంలో అదే డబ్బుతో చిన్న ఎత్తిపోతల పథకాలను, వాటర్‌షెడ్ స్కీములను రూపొందించి, వర్షపు నీటిని ఎక్కడికక్కడ ఒడిసిపట్టి సాగునీరు అందించే ప్రయత్నం చేయటం ద్వారా దీర్ఘకాలంతో మెరుగైన ఫలితాలు వస్తాయి. ఆహారోత్పత్తి లక్ష్యమూ నెరవేరుతుంది. ఈరకంగా ఖర్చుకు, ఆదాయానికి, ఆహారోత్పత్తికి సమతుల్యతతో కోటి ఎకరాలకు నీళ్లు అందిస్తే ఆహ్వానించదగ్గదే. మిగిలిన నిధులతో గ్రామాల సముదాయం చుట్టూ చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసేలా రైతులకు, వారి పిల్లలకు ప్రోత్సాహాన్నివ్వాలి. వీరి ద్వారా చిన్న, మధ్యతరగతి పరిశ్రమల్ని ప్రోత్సహిస్తే యువతకు పుష్కలంగా ఉపాధి లభిస్తుంది. వలసలు పోవాల్సిన పని ఉండదు.

ఈ ప్రాజెక్టుల వెనక తమ పాత్ర పెద్దగా లేదని, ఆదేశాలకనుగుణంగా రూపకల్పన చేసి ఇస్తున్నామని నీటిపారుదల శాఖ నిపుణులు, అధికారులు కూడా ముక్తసరిగా సమాధానమిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. గతంలో జలయజ్ఞం పేరుతో జరిగిన ధనయజ్ఞంలాగే నేతలకు, కాంట్రాక్టర్లకు కమీషన్ల కోసమే ప్రాజెక్టుల రూపకల్పన జరిగిందని, డిజైన్లు తరచూ మారుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ ఉద్యమంలో బాధ్యతాయుతంగా పనిచేసిన వారు లేవనెత్తిన ప్రశ్నలకు కూడా ప్రభుత్వం సరైన సమాధానం ఇవ్వలేదు. అధికారం శాశ్వతం కాదు. ముఖ్యమంత్రులు, ప్రభుత్వాలు, అధికారులు మారిపోతారు. కానీ వారి పనుల పర్యవసానాన్ని ప్రజలు అనుభవించాలి.

అందుకే ఏకపక్షంగా కాకుండా, తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులపై, రీడిజైన్‌లు, భారీ పథకాలు, రైతులకు వచ్చే ఆదాయంపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించి, ప్రభుత్వ వ్యవసాయ-ఆర్థిక విజన్ ఏమిటో గణాంకాలు, ఇతర సాక్ష్యాలతో సహా ప్రజల ముందుంచి, రాజకీయ పార్టీలతో, పౌరసంస్థలతో, నిపుణులతో చర్చించాకే, వారి ప్రశ్నలకు సమాధానం చెప్పాకే తుది నిర్ణయం తీసుకోవాలి. ◈

# జస్టిస్ ఎం.ఎన్ రావ్ హితవు

**- టంకశాల అశోక్**

ఉస్మానియా యూనివర్సిటీలో ఇటీవల బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై చర్చాగోష్టి జరిగినప్పుడు, జస్టిస్ ఎం.ఎన్ రావ్ (రిటైర్డ్) ఆ ఫలితాల జోలికి వెళ్లకుండా, పిల్లలు బాగా చదువుకోవాలని చెప్తూపోయారు. ఆ చర్చా కార్యక్రమానికి ఆయన అధ్యక్షుడు. బీహార్ ఎన్నికలలో గెలిచింది ఎవరో తెలిసిందే. అక్కడ జేడీయూ, ఆర్జేడీ గెలవటం సామాజిక శక్తులకు, బీజేపీ ఓడటం సెక్యులర్ వర్గాలకు స్ఫూర్తి కలిగిస్తుందన్న ఉద్దేశంతో యూనివర్సిటీకి చెందిన కొందరు ఆ గోష్టిని ఏర్పాటు చేశారు. తక్కిన వక్తలంతా అవే రెండు కోణాలను చర్చించారు. కానీ వారికి భిన్నంగా జస్టిస్ ఎం.ఎన్ రావ్ ఆ విషయమై ఒకటిరెండు మాటలకి మించి చెప్పలేదు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు బాగా చదువకోవడం, మంచి పరిశోధనలు చేయడం అవసరమన్నారు. ఎందుకు అవసరమో వివరించారు. గోష్టి అంశానికి భిన్నంగా ప్రసంగించటం ఒక విధంగా ఆశ్చర్యాన్ని కలిగించేదే. ఆయన ఏ ఉద్దేశంతో ఆ పని చేశారో తెలియదు. కానీ తప్పకుండా ఉద్దేశపూర్వకంగానే అట్లా చేసి ఉంటారు.

ఇప్పుడు ఆలోచిస్తే, ఎందుకట్లా చేసి ఉన్నా సరిగానే చేశారనిపిస్తుంది. గోష్టి అంశానికి, తను ప్రసంగించిన దానికి ఒక స్థాయిలో సంబంధం ఉందని కూడా అర్థమవుతుంది. బీహార్‌లో రాజకీయంగా సామాజిక వర్గాలు గెలవటం, బీజేపీ ఓడటం నుంచి అందరూ నేర్చుకోవలసింది చాలానే ఉంది. కానీ ఈ వర్గాల గెలుపుఓటములు కేవలం రాజకీయాలతో ముడిపడినవి కావు. వారి గెలుపు సర్వతోముఖమైనది కావాలి. అందులో అన్నింటికన్నా ప్రధానమైనది విద్య. కానీ ఉస్మానియా విద్యార్థులు, వారితోపాటు ఈ సామాజిక వర్గాలకు చెందిన అధ్యాపకులు విద్యను, శిక్షణలను తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారు. వారు తమ దృష్టిని ఈ దశలో ప్రధానంగా విద్యపై కేంద్రీకరించి, ఇతర అంశాలకు తదనంతర ప్రాధాన్యాలను ఇవ్వాలి. అట్లా జరగకపోవడం వల్ల వారికి కలుగుతున్న నష్టాలు అనేకవిధాలుగా ఉంటున్నాయి. చదువు, ఉపాధి నష్టాలు సరేసరి కాగా, తాము మాట్లాడుతున్న ఇతర రంగాలలోనైనా సాధిస్తున్నది దాదాపు శూన్యం. స్వప్రయోజనాల కోసం సొంత అజెండాలతో పనిచేసే కొందరికి ఉపయోగపడటం తప్ప. అటువంటి అపారమైన అనుభవం, అంతకుమించిన విజ్ఞత గల జస్టిస్ ఎం.ఎన్ రావ్ బహుశా దీనినంతా దృష్టిలో ఉంచుకునే ఆ విధంగా మాట్లాడి ఉంటారనిపిస్తుంది.

ఉస్మానియా, కాకతీయ తదితర తెలంగాణ యూనివర్సిటీలలో ఈరోజున చదువులు, పరిశోధనల పరిస్థితి ఎంత దారుణంగా ఉన్నదో అందరికీ తెలుసు. సైన్స్, ఇంజినీరింగ్ కోర్సులు కొంత బాగానే ఉన్నా, ఆర్ట్స్ విభాగాలు దయనీయమైన స్థితికి పడిపోయాయి. విద్యార్థులను, అధ్యాపకులను, పరిపాలనా విభాగం వారిని ఎవరిని కదిలించినా వినిపించే మాటలివే. వారు చెప్పగా వినటం మాత్రమే కాదు, క్లాసులు, లైబ్రరీలు, సెమినార్లు, వారిలో కొందరు ఒకచోట చేరి సబ్జెక్టు గురించి మాట్లాడే తీరు వంటి దేనినైనా గమనించండి. ఇదే అభిప్రాయం ఇంకాఇంకా కలుగుతుంది. సెమినార్ పేపర్లు, ఎంఫిల్–పీహెచ్‌డీ థీసిస్‌ల గురించి మాట్లాడటం లేదు. అది కష్టం కూడా. ఎందుకంటే, వాటిని విద్యార్థులు సొంతంగా రాసేది ఎంతో ఇతరులతో రాయించేది ఎంతో తెలియదు. వారి కోసం రాసే ఇతరులలో




స్వయంగా అధ్యాపకులు కూడా ఉన్నారని, వారు తరచుగా డబ్బు తీసుకుని ఆ పని చేస్తున్నారన్నది అందరికీ ఎప్పటినుంచో తెలిసిన బహిరంగ రహస్యం. న్యాయమూర్తికి ఇదంతా తెలియనిదే ఆ విధంగా మాట్లాడి ఉంటారనుకోలేం. ఈ పరిస్థితుల పట్ల తను ఎంత బాధపడి ఉండకపోతే, ఆనాటి చర్చాగోష్టి అంశం కన్న ఈ సమస్యకు ప్రాధాన్యం ఇవ్వటం అవసరమని భావించి ఉంటారు!

గనులలో తవ్విన కొద్దీ మణిమాణిక్యాలు లభిస్తాయి. మన యూనివర్సిటీల తీరుతెన్నులను తరచిచూసినకొద్దీ మనకు విచారం కలిగించే విషయాలు దృష్టికి వస్తాయి. క్లాసులు సరిగా జరగవు. అధ్యాపకులు, విద్యార్థులు హాజరుకావడం తక్కువ. పాఠాలు సరిగా చెప్పరు. స్వయంగా అధ్యాపకులు కొత్తగా చదివి నేర్చుకోవటం అరుదు. తప్పులు లేకుండా ఇంగ్లిషు మాట్లాడగలవారిని, రాయగలవారిని వెతుక్కోవలసిందే. ఈ రెండు సరిగా రాకుండానే ప్రొఫెసర్ల స్థాయికి చేరి రిటైరైన వారున్నారంటే ఇతరుల గురించి చెప్పనక్కర్లేదు. వారు బోధించే విద్యార్థుల గురించి ఎవరి ఊహలు వారు చేయవచ్చు. తగినంత అనుభవం సంపాదించిన తర్వాత కూడా లైబ్రరీలో, ఆర్కైవ్స్‌లో కూర్చునే విషయంలో అధ్యాపకులకు, విద్యార్థులకు తేడా లేదు. విద్యార్థులు ఇంకా విద్యార్థులు గదా అని చెప్పదలచుకున్నా, అధ్యాపకుల గురించి చెప్పేందుకు ఏ సాకులూ కనిపించవు. తమతమ సబ్జెక్టులలో ఒరిజినల్ రిసెర్చ్ లక్షణాలున్న పేపర్లుగానీ,

మోనోగ్రాఫ్‌లు, పుస్తకాలు గానీ పబ్లిష్ చేసిన వారి జాబితా ఎవరైనా తయారుచేసినట్టయితే, పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థమవుతుంది. ఇదే పరిస్థితి విద్యార్థులోనూ ప్రతిఫలిస్తున్నది. వీరి చదువులు అనబడేవి, పరిశోధనలు అనబడేవి ఇదే విధంగా కొనసాగి, వారు 'ఏదో విధంగా' డిగ్రీలు సంపాదించి తాము కూడా అధ్యాపకులు అయినా, లేక ఇతర ఉద్యోగాలు చేసినా వారి బోధనాస్థాయి, పనితీరు ఎంత నాణ్యంగా ఉండగలదో వేరే చెప్పనక్కర్లేదు.

ఇటువంటి పరిస్థితులు, ప్రమాణాలు కళ్ల ఎదుట కనిపిస్తున్నప్పుడు జస్టిస్ ఎం.ఎన్ రావ్, మన యూనివర్సిటీల విద్యార్థులకు చదువులు, పరిశోధనలు ఎక్కువ ప్రధానమైనవని భావించారా అన్నట్లు ఆవిధంగా మాట్లాడితే అందుకు అవుననగలం తప్ప కాదనటం సాధ్యమా? వాస్తవానికి బీహార్ ఎన్నికల ఫలితాలను హర్షించే వర్గాల విద్యార్థులకు చదువుకోవాలంటే ఇప్పుడు గొప్ప అవకాశాలున్నాయి. కానీ వారు వాటిని సద్వినియోగం చేసుకోక చేజార్చుకుంటున్నారు. సుమారు రెండు దశాబ్దాలుగా సంపన్నుల పిల్లలు ఇటువంటి క్యాంపస్‌లకు వచ్చి చదవటం తగ్గుతున్నది. మంచి హోదాలు, సంపాదనలకు అవకాశాలు ఉండే కోర్సులకు క్యాంపస్‌లకు పోతున్నారు వారు. దేశంలో, విదేశాలలో ఆ కారణంగా ఉస్మానియా, కాకతీయ వంటి క్యాంపస్‌లలో సాధారణ వర్గాల వారి అడ్మిషన్లు గణనీయంగా పెరుగుతున్నాయి. స్కాలర్‌షిప్‌ల సంఖ్య, సొమ్ము ఎక్కువవుతున్నాయి. బాగా చదివినవారికి ఇంకా మెరుగైన విశ్వవిద్యాలయాలలో అవకాశాలుంటున్నాయి. మంచి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. గతంతో పోలిస్తే తెలంగాణ యువకులు చెప్పుకోదగ్గ సంఖ్యలో దేశవిదేశాలలో అవకాశాలు సాధిస్తున్నారు. అయితే ఇదంతా బాగా చదువుతున్నవారి విషయం. అత్యధికులు ఆ పని చేయటం లేదన్నది ఇక్కడ గుర్తించవలసిన సంగతి. యువకులలో పెద్దసంఖ్యాకులు గ్రామాలకు, సామాన్య కుటుంబాలకు చెందినవారు. వారికి చదువులు, పరిశోధనలు, భవిష్యత్ అవకాశాల గురించి అంతగా తెలియదు. అవన్నీ చెప్పవలసింది అధ్యాపకులు. వారు ఆ బాధ్యతను శ్రద్ధతో నెరవేర్చితే యువకులకు, విద్యారంగానికి, సమాజానికి చెప్పలేనంత మేలు కలుగుతుంది. కానీ ఉపాధ్యాయులలో అటువంటి బాధ్యతాయుతమైన దృష్టిగలవారే తగ్గిపోతున్నారు. తమ పెద్దపెద్ద జీతభత్యాలతో జీవితాలను ఆనందిస్తున్నవారు కొందరైతే, సొంత అజెండాతో విద్యార్థులను రకరకాలుగా రెచ్చగొడుతున్నవారు మరికొందరు.

యువకులు సమాజంతో సంబంధంలేని విధంగా తయారుకావటం ఎంతమాత్రం వాంఛనీయం కాదు. ఆ సంబంధానికి తగిన చైతన్యాలు కూడా తప్పనిసరి. కానీ చదువులకు, వాటికి మధ్య సమతులనం అవసరం. విద్యది మొదటి ప్రాధాన్యం కావాలి. విద్యలో, ఉద్యోగాలతో నిమిత్తంలేని రంగాలను తమ జీవితమార్గంగా ఎవరైనా ఎంపిక చేసుకుంటే




అది వారి హక్కు. కానీ అత్యధికులు దానిని మార్గంగా తీసుకోవటం లేదు. వారి పరిస్థితులు, ఆకాంక్షలను బట్టి వారికి చదువులు, చైతన్యాలు రెండూ అవసరం. అవే పరిస్థితుల కారణంగా చదువులు, ఉపాధి మొదటి ప్రాధాన్యం అవుతాయి. అందుకోసం అవసరమైన సకల సదుపాయాలు ఆరోజున వారికి లేకపోవచ్చుగాక. కానీ అవి లోగడకన్న మెరుగుపడిన మాట నిజం. ఈ ఉన్న అవకాశాలనే సద్వినియోగం చేసుకుని ఇదే యువకుల నుంచి పలువురు తమ కడగండ్ల నేపథ్యం నుంచి బైటపడి జీవితంలో ముందుకు పోతున్నారనేది నిజం. ఇవే వర్గాల నుంచి వచ్చి ఇదంతా చేస్తున్న యువకులు ఈరోజున దేశంలోని వివిధ ప్రాంతాలలో, విదేశాలలో అనేకులు కనిపిస్తున్నారు. దీని నుంచి, మెజారిటీ సంఖ్యలో మనకు క్యాంపస్‌లలో కనిపించేవారు తీసుకుంటున్న స్ఫూర్తి ఏమిటో అర్థం కావటం లేదు. వారికి కనీసం ఇవే వర్గాలకు చెందిన అధ్యాపకులు ఇస్తున్న గైడెన్స్ ఏమిటో బోధపడటం లేదు. వీరు పిల్లలను బాగు చేయదలచుకున్నారో, లేదో వారి దృష్టిలో చదువులు మొదటి ప్రాధాన్యతో, రెండవ ప్రాధాన్యతో, యువకుల జీవితాల అజెండాకు బదులు తమ అజెండాలను వారిపై రుద్దదలచుకున్నారో తెలియటం లేదు. చదువులు మామూలు పద్ధతిలో సాగినా ఒక్కోసారి అసాధారణ ఘటనలు సంభవించి లేదా పరిణామాలు ఏర్పడి విద్యార్థులు వాటికి ప్రాధాన్యం ఇవ్వవలసి వస్తుంది. అది విస్మరించరానిది, సహజమైనది. కానీ సాధారణ పరిస్థితులలోనైనా విద్యకు మొదటి ప్రాధాన్యమిస్తూ అందుకు తగినట్టు చదవటం విద్యార్థులు, వారికి శ్రద్ధగా పాఠాలు చెప్పి మార్గదర్శనం చేయటం అధ్యాపకులు చేస్తున్నారా అన్నది ప్రశ్న.

అది జరుగుతుండి ఉంటే, జస్టిస్ ఎం.ఎన్ రావ్ బీహార్ ఎన్నికల చర్చ వంటి సందర్భంలో చదువుల గురించి అంతగా నొక్కి చెప్పవలసిన అవసరం ఏర్పడేది కాదు. విద్యార్థులు, వారి కుటుంబాలు అనేకాదు, విస్తృత దృష్టిలో ఆలోచించినప్పుడు తెలంగాణ సమాజానికి, రాష్ట్రం అనే యూనిట్‌కు కూడా యువతీయువకులు బాగా చదవటం, పరిశోధనలు చేయటం అవసరం. అదొక సంస్కృతిగా మారి క్యాంపస్‌లలో కొత్త వాతావరణం ఏర్పడాలి. అక్కడి నుంచి విజ్ఞానాలు, చైతన్యాలు కలగలసిన తరాలు రావాలి.

(నమస్తే తెలంగాణ సౌజన్యంతో) ◈

# 85శాతం మందికి కులపోళ్లు ఒరగబెడుతున్నదేమీ లేదు




తమ కులం వాళ్లు తమకు ఒరగబెట్టిందేమీ లేదని దాదాపు 85శాతం మంది ప్రజలు ఓ శాంపిల్ సర్వేలో చెప్పారు. ఆంధ్రప్రదేశ్ దశ-దిశ కార్యక్రమంలో భాగంగా హెచ్ఎంటీవీ ఈ సర్వేను నిర్వహించింది. ఆర్థికంగా, ఉపాధిపరంగా తమ కులం వాళ్లు సాయపడ్డారు అని చెప్పినవాళ్లు కేవలం 4-5శాతం మంది ఉన్నారు. కాలేజీ సీట్లలో, వైద్యసేవల్లో కులపరంగా సాయం అందుకున్నామని కొంతమంది చెప్పినప్పటికీ వీరి సంఖ్య కూడా 14-15శాతం మించలేదు. మొత్తంగా 85శాతం మంది కులపోళ్లు తమకు చేసిందేమీ లేదని తేల్చిచెప్పారు. కులం వల్ల ఒరుగుతున్నదేమీ లేకపోయినా, వేరే కులంలో వారికి డబ్బున్నాసరే తమ పిల్లల్నిచ్చి పెళ్లి చేయబోమని 33శాతం చెప్పారు. ఈ వివరాలను ఇటీవల కాకినాడలో జరిగిన దశ-దిశలో కార్యక్రమ సమన్వయకర్త, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ వెల్లడిస్తూ, ఇప్పటికైనా కులం పిచ్చి నుంచి బైటపడాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ఎంటీవీ సర్వేతోపాటు ఎవరికివారు తమ సొంతంగా కూడా తమ పరిధిలో కులం చేస్తున్న నిజమైన సాయంపై సర్వేలు నిర్వహించి వాస్తవాల్ని అనుభవపూర్వకంగా గ్రహించాలన్నారు. కులం చేస్తున్న మేలు ఏమీ లేకపోయినా కులం దాటి పెళ్లిళ్లు చేయబోమంటున్న పెద్దలను అవసరమైతే ధిక్కరించాలని, వ్యక్తిత్వం నచ్చితే కులం వెలుపలవారిని ధైర్యంగా పెళ్లిచేసుకోవాలని, కులాంతర వివాహాలతో సమాజం కులసంకెళ్లను తెంచాలని జేపీ పిలుపునిచ్చారు. ◈

# నాణ్యమైన చదువులేక పెరుగుతున్న ఇంజినీరింగ్ నిరుద్యోగులు

ఎంత ఎక్కువ చదువుకుంటే అంత ఎక్కువ నిరుద్యోగం అనే పనికిమాలిన విద్యావ్యవస్థ ఉన్న మనదేశంలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కూడా చదువు మీద వెచ్చించే ప్రతి ఏడాదీ, ప్రతి రూపాయీ కూడా విలువైనదే. అందుకే నాలుగేళ్లు ఇంజినీరింగ్ చదువుకోవటం అంటే ఇప్పుడు భయపడి పోతున్నారు. ఇంజినీరింగ్ పట్టా పుచ్చుకుని బైటకొస్తే ఉద్యోగం దొరకటం ఎంత కష్టమో చూస్తున్నాక గతంలోలా ఇంజినీరింగ్ అంటే ఉన్న మోజు కాస్తా తగ్గిపోతోంది. ఇటీవల యాస్పయిరింగ్ మైండ్స్ (ఎఎం) విడుదల చేసిన సర్వే కూడా విద్యార్థులను, తల్లిదండ్రులను హెచ్చరించే లెక్కనే ఉంది. ఇంజినీరింగ్ చదివి పట్టాలతో బైటికొస్తున్న విద్యార్థుల్లో చాలామందికి ఉద్యోగాలకు అవసరమైన ప్రమాణాలు లేవని ఎఎం తన నేషనల్ ఎంప్లాయబిలిటీ నివేదికలో పేర్కొంది. ఎకాఎకి 80శాతం మంది ఉద్యోగాలకు పనికిరారని తేల్చేసింది. ఈ నివేదికను రూపొందించటానికి, 2015లో దేశంలోని 650 కళాశాలల నుంచి ఇంజినీరింగ్ పూర్తి చేసిన లక్షన్నర మంది విద్యార్థులను పరిశీలించారు. మన విద్యలో నాణ్యతా ప్రమాణాలను పెంచటంతోపాటు అండర్ గ్రాడ్యుయేట్ కార్యక్రమాలను మరింత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాల్సిన అవసరముంది అని ఎఎం ప్రతినిధి తెలిపారు. నిజానికి మనదేశంలో పట్టభద్రుల కొరత లేదు, కానీ వారిలో నాణ్యతాప్రమాణాలే కొరవడుతున్నాయి.

ఏటా దేశవ్యాప్తంగా వేలాది కళాశాలలు, విద్యాసంస్థల నుంచి లక్షలాదిగా డిగ్రీ కాగితాలు చేతిలో పట్టుకుని వస్తున్నా, ప్రైవేటు, కార్పొరేట్ కంపెనీలు మాత్రం తమ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల్లో భర్తీకి తగిన అభ్యర్థులు దొరకటం లేదని ఫిర్యాదు చేస్తున్నాయి. డిగ్రీలు, పీజీలు, చివరికి పీహెచ్‌డీలు చేసినవారు కూడా ఎంతచిన్నదైనా ప్రభుత్వోద్యోగంలో చేరాలన్న అసమర్థ మానసిక స్థితి నుంచి ఇంకా బైటపడలేకపోవటం, ఇంకా ప్యూను ఉద్యోగాలను భర్తీ చేసే ప్రభుత్వాలుండటం కూడా ఈ పరిస్థితికి ఒకరకంగా కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ◈

# సమానత్వానికి గడువు ఇంకా 14 ఏళ్లే

- డా॥ అరుణ ఎ. హాకిన్స్ (పెన్సిల్వేనియా)

వ్యవస్థలో మార్పు కోసం లోక్‌సత్తా ప్రయత్నాల్ని చూసినవారిలో ఎక్కువమంది 'పచ్చికాయను మాగబెడుతున్నామా?' అని తరచూ అంటుంటారు. ఉన్నవ్యవస్థలోనే మార్పు దానంతటదే నెమ్మదిగా వస్తుందని, మనం దాన్ని ఎదిరించకుండా అప్పుడప్పుడూ కొత్త ప్రయత్నాలు చేస్తూ ఎంజాయ్ చేస్తుండాలే తప్ప సమూలంగా మార్చే ప్రయత్నం చేయకూడదు అని వారి అభిప్రాయం. ఈ మాటల్ని చెప్పేవారిలో లోక్‌సత్తావారు కూడా కొంతమంది ఉన్నారు. అయితే లోక్‌సత్తా చెప్పేది వాస్తవం అని అందరూ అంగీకరిస్తున్నప్పుడు, అది తప్ప మార్గం లేదని ఒప్పుకుంటున్నప్పుడు, అది పూర్తిగా ఆచరణాత్మకమైనప్పుడు మనం ఆ దిశగా ఎందుకు ప్రయత్నం చేయకూడదు? అనేది లోక్‌సత్తా మౌలిక వాదన. 2016 అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంగా ఐక్యరాజ్యసమితి కూడా లోక్‌సత్తా తరహాలో ఆలోచించి స్త్రీ-పురుష సమానత్వ లక్ష్యాన్ని చేపట్టింది. యధాస్థితిని కొనసాగిస్తే, అంటే మార్పులను సాంప్రదాయ రాజకీయ ధోరణితో నెమ్మదిగా నడిపిస్తే, స్త్రీ-పురుష సమానత్వానికి 22వ శతాబ్దం (2133) దాకా వేచి చూడాల్సి రావచ్చని అంచనా. ఇప్పుడు పుట్టే ఆడపిల్లలు ముదుసళ్లు అయినాక కూడా సమానత్వాన్ని చూడలేకపోవచ్చు. అందుకే మార్పుకి ఉన్న అవకాశాలనూ వినియోగిస్తూ, భూమ్మీద లింగ సమానత్వానికి 2030 సంవత్సరం గడువని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. '2030 నాటికి ప్లానెట్ 50-50' సాధించేందుకు లింగసమానత్వ మార్పుని వేగవంతం చేయాలని పిలుపునిచ్చింది. ఇందుకోసం ఇతర విధాన, చట్టపరమైన చర్యలతో పాటు నాణ్యమైన విద్య, ఆరోగ్యాలను కీలకంగా పేర్కొంది. అన్ని దేశాలూ మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలకు నాణ్యమైన విద్యను, ఆరోగ్యాన్ని అందించేందుకు కృషి చేయాలని సమితి స్పష్టంచేసింది. స్త్రీ-పురుష సమానత్వం కోసం 20 ఏళ్ల క్రితం 189 దేశాల ప్రభుత్వాలు బీజింగ్ డిక్లరేషన్ మీద సంతకాలు చేసినా ఇంకా వివక్ష కొనసాగుతూనే ఉంది. అందుకే 2015లో ప్రపంచ దేశాలు, పౌరసంస్థలు ధృవీకరించిన 2030 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను లింగసమానత్వ లక్ష్యం దిశగా వేగవంతం చేయాలనే ప్రయత్నం మొదలైంది. 'మానవాళిని శక్తిమంతులుగా తీర్చిదిద్దడానికే స్త్రీ జాతికి ప్రత్యేకతను ఆపాదిస్తూ మహిళా దినోత్సవం నిర్వహించుకుంటున్నాం. అభివృద్ధే ప్రణాళికగా మహిళలను బలోపేతం చేయాలి. ప్రపంచ దేశాలలోని 50శాతం మంది ప్రజలు మహిళల శక్తిసామర్థ్యాలను గ్రహించలేనట్లయితే నూరుశాతం మన లక్ష్యాలను ఎన్నటికీ చేరుకోలేం'' అని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ బాన్ కీ మూన్ హెచ్చరించారు.




ఈ నేపథ్యంలో, చాలామంది పాలకులు, అధికారులలాగా మొక్కుబడిగా, ఆనవాయితీలాగా కాకుండా మన లక్ష్యానికి పునరుత్తేజం ఇచ్చేలా లోతైన చర్చలు, కార్యాచరణతో మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకోవాలి. వాస్తవానికి మహిళలు ఎన్నో స్ఫూర్తిదాయకమైన ఫలితాలను సాధించినప్పటికీ అంతకంటే ఎక్కువ లోటుపాట్లు మిగిలివున్నాయి. వివక్ష కొనసాగుతూనే ఉంది. లైంగిక దాడులు, గృహ హింస, మానసిక వేదనకు గురికావటం, బలవంతపు వ్యభిచారం బాలికలకు, మహిళలకు పెనుసవాళ్లుగా ఉన్నాయి. స్త్రీలు సాధించిన అపూర్వ విజయాలను చాటి చెప్పటానికి, పాత, రాబోయే సవాళ్లను గురించి తెలుసుకోడానికీ, పరిష్కారంలో భాగంగా ప్రజలందరూ ఏకం కావలసిన అవసరాన్ని తీర్మానించడానికీ మహిళా దినోత్సవం వేదిక కాగలదు. మహిళలపై వేధింపులు ఒక్క దేశానికో కుటుంబానికో పరిమితం కాదనే విషయాన్ని మరువకూడదు. మహిళలంతా సిద్ధం కావాలి. హక్కుల పోరాటాలు చేస్తూ, వివక్షపూరిత ఘటనలకు ఎదురుతిరగాలి. ధైర్యంతో కేసులు వేయాలి. బాధితులు తమపై దాడి చేసినవారికి తగిన శిక్షలు పడేవరకూ విశ్రమించరాదు. సమాజం కూడా ఏదో ఒక ఘటన విషయంలోనే కాకుండా అందరి విషయంలో తుదికంటా మార్పు వచ్చేంత వరకూ పోరాడాలి. ప్రతి మహిళా తాను ఎంచుకున్న మార్గంలోని నిస్సంకోచంగా చేరుకోగలగాలి. అది రాజకీయాలు కావచ్చు, వ్యాపార రంగం కావచ్చు, ఉన్నత విద్యావకాశాలు కావచ్చు. ఏదోరకంగా తనకుతాను స్వతంత్రంగా ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశాన్ని అందిపుచ్చుకోవడం, వివక్ష, నేరపూరిత సమాజం ప్రభావాన్ని అధిగమించి స్వతంత్రంగా జీవించగలగడం ప్రతి మహిళ హక్కు. అలాగే ఇది మహిళలకు మాత్రమే సంబంధించిన అంశం కాదు. ప్రతీ కుటుంబం నుంచి మొదలయ్యే సమస్య. అందుకే మహిళల పోరాటానికి పురుషులూ తోడ్పడాలి. ◈

గత శతాబ్దకాలంగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న

లోక్‌సత్తా పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు

# Kalpataruvu Spinning Mills Ltd

NH-5, Thimmapuram -522 233, Ediapadu Mandal,
(via) Chilakaluripet, Guntur Dt. (A.P)

Ph.08647-258995, Fax 08647-258994
Email : kalapataruvu2007@yahoo.co.in

## L. Raghu Rami Reddy

Managing Director

Ph.+91 9885188103, 9246487502

గత శతాబ్దకాలంగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న
లోక్‌సత్తా పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు

# ప్రగతి నర్సింగ్ హోమ్

**చిలకలూరిపేట, ఫోన్ : 253253**

**డా॥ కొల్లా రాజమోహనరావు** M.B.B.S., D.C.H.,
పిల్లల వైద్య నిపుణులు

**డా॥ హేమంతీ దేవి** M.B.B.S., D.G.O.,
స్త్రీ ప్రసూతి గర్భకోశ వ్యాధి నిపుణులు

**డా॥ కొల్లా అమర్** M.B.B.S., D.C.H.,
పిల్లల వైద్య నిపుణులు

**డా॥ భాగ్యమాల** M.B.B.S., D.G.O.,
స్త్రీ ప్రసూతి గర్భకోశ వ్యాధి నిపుణులు





**మనమందరము కలసి మన పిల్లలకు మంచి ఆరోగ్యాన్ని ఇద్దాం !**

గత శతాబ్దకాలంగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న
లోక్‌సత్తా పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు

# A Man of Success




MODERN
A Symbol of Quality Education



Modern shopping Mall






Vidya Ratna
## SRI CHEBROLU MAHESH

# మోడరన్ విద్యాసంస్థలు

**మోడరన్ తెలుగు మీడియం స్కూల్, గాంధీపేట**
(నర్సరీ to 10 వ తరగతి) ఫోన్ : 257555, 9299997325

**మోడరన్ డిగ్రీ కాలేజ, హైస్కూల్ రోడ్**
Groups : B.Com., (Gen & Comp), B.Sc. (Maths, Stat, Comp)
B.Sc. (Maths, Phy, Comp) ఫోన్ : 255247, 9299997327

**మోడరన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, సుబ్బయ్యతోట**
(KG to V Std) ఫోన్ : 255249, 9299997321

**మోడరన్ జూనియర్ కాలేజ ఆఫ్ ఆర్ట్స్ & సైన్స్, హైస్కూల్ రోడ్**
Groups : MPC, MEC & CEC (TM &EM) ఫోన్ : 253624, 9299997326

**మోడరన్ కాన్సెప్ట్ స్కూల్, గాంధీపేట**
(VI to X Std) ఫోన్ : 9299997322

**MODERN STELLAR**
The First A/C Campus in Chilakaluripet

**మోడరన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, పండరీపురం**
(నర్సరీ to X Std) ఫోన్ : 257249, 9299997324

**మోడరన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, మద్దినగర్**
(నర్సరీ to VII Std) ఫోన్ : 9299997328

Posting Date 07-03-2016

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on March Ist 2016

గత శతాబ్దకాలంగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న

లోక్‌సత్తా పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు

# SRI DHANA LAKSHMI GROUP OF INDUSTRIES

CHILAKALURIPET



*BEST WISHES FROM*







**Book-Post**

PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad